www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల రూ.5.00

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 9014966169

Published from: Hyderabad, Karimnagar, Rangareddy, Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 36 | మంగళవారం | 8 సెప్టెంబర్, 2026

# రణరంగంగా అసెంబ్లీ

## బీజేపీ, బీఆర్ఎస్ నిరసనలతో దద్దరిల్లిన అసెంబ్లీ ప్రాంగణం



## స్పీకర్‌ను అవమానిస్తే సహించం

- ఇలాంటి భాష వాడిన సభ్యుడిని డిస్మిస్ చేయాలి
- తాతా మధు వ్యాఖ్యలను బీజేపీ కూడా ఖండించింది.. కేసీఆర్ క్షమాపణ చెప్పాలి: సీఎం రేవంత్‌రెడ్డి
- స్పీకర్‌కు జరిగిన అవమానంపై చర్చ తర్వాతే ఇతర అంశాలు: ముఖ్యమంత్రి
- తాతా మధును బర్తరఫ్ చేయాలి: మహేశ్వర్‌రెడ్డి
- కేసీఆర్ క్షమాపణ చెప్పాలి: మంత్రి సీతక్క

**ప్రజానావ, హైదరాబాద్:** శాసనసభ స్పీకర్‌ను అవమానించేలా అసభ్యకర భాషను ఉపయోగించడం చట్టసభల గౌరవాన్ని దెబ్బతీయడమేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా సీఎం తీవ్రంగా స్పందించారు. స్వతంత్ర భారత చరిత్రలో సభాపతికి ఇలాంటి తరువాయి 2లో







# రేవంత్ రెడ్డి విద్యా వ్యవస్థను దెబ్బ తీస్తున్నాడు

- మొన్న ఇంటర్మీడియట్ రద్దు అన్నడు..
- నేడు పాలిటెక్నిక్ విద్యను ప్రమాదంలోకి నెట్టాడు
- ఫీ రీయింబర్స్ మెంట్ బకాయిలు తక్షణమే చెల్లించాలి
- నెల నెలా ఫీజు బకాయిలు చెల్లిస్తామని నిండు సభలో మాట తప్పాడు
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థుల జీవితాలు ఆగమవుతున్నాయి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత
- ఫీజు పోరు యాత్రతో దద్దరిల్లిన ఓరుగల్లు
- కలెక్టరేట్ వరకు వేలాది మంది విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ
- కలెక్టర్‌కు మెమోరాండం సమర్పించి టీఆర్ఎస్ చీఫ్

2

## పోలీసులపై దాడి చేస్తే అధికారంలోకి
# వస్తామనుకోవద్దు



- బీఆర్ఎస్ సభ్యుల తీరు దారుణం.. ప్రజాప్రతినిధులు హుందాగా వ్యవహరించాలి
- యూనిఫాంలో ఉన్న పోలీసు కాలర్ పట్టుకున్నారు.. కేటీఆర్ చేయి చేసుకున్నట్లు కనిపించింది
- స్పీకర్‌పై వ్యాఖ్యలను బీఆర్ఎస్ ఎందుకు ఖండించడం లేదు?
- క్షమాపణ చెప్పిన తర్వాతే మిగతా కార్యకలాపాలు.. ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుంది: ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రజానావ, హైదరాబాద్:** శాసనసభ ప్రాంగణంలో బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య చోటుచేసుకున్న వాగ్వాదంపై మంత్రి శ్రీధర్‌బాబు తీవ్రంగా స్పందించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ పోలీసులపై ఇలాంటి ఘటనలు ఎప్పుడూ జరగలేదని అన్నారు. యూనిఫాంలో ఉన్న పోలీసులపై కొందరు బీఆర్ఎస్ సభ్యులు దాడికి పాల్పడినట్లు కనిపించిందని ఆరోపించారు. సీనియర్ శాసనసభ్యుడిగా ఉన్న వ్యక్తి పోలీసులపై దాడి చేశారని, మరో ఎమ్మెల్యే యూనిఫాంలో ఉన్న పోలీసు కాలర్ పట్టుకున్నారని పేర్కొన్నారు. పోలీసులపై దాడికి సంబంధించిన దృశ్యాలు మీడియా ఛానళ్లలో తరువాయి 2లో

# మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దురుసు ప్రవర్తన

- అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనను రాష్ట్రం మొత్తం చూసింది
- సబితా ఇంద్రారెడ్డి జుట్టు పట్టుకుని గొంతు నొక్కే ప్రయత్నం చేశారు
- సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాల్సిందే.. లేదంటే జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయిస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం అంశాన్ని పరిశీలిస్తాం: కేటీఆర్

2





## అసెంబ్లీ చరిత్రలో నేడు బ్లాక్ డే

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు
- ప్రధాన ప్రతిపక్షం లేకుండానే సభ నిర్వహించాలని చూస్తున్నారు
- సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డిపై అనుచితంగా వ్యవహరించారు
- కేటీఆర్‌కు గాయాలు.. సీఎం తగిన మూల్యం చెల్లించక తప్పదు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

2

## స్పీకర్‌ను అవమానించలేదు



- నా వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నా
- గడ్డం ప్రసాద్‌కుమార్‌పై గౌరవం ఉంది
- నేను అనని మాటలను నాకు ఆపాదించడం సరికాదు
- ఆవేశంలో మాట్లాడాను: తాతా మధు

2



## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై
# పోరు ఆగదు

- విద్యార్థుల సమస్యను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు
- 22న భూముల అంశంపైనా అసెంబ్లీలో చర్చ జరగాలి
- బకాయిలు విద్యార్థులకు వెంటనే చెల్లించాలి
- సీఎం అపాయింట్‌మెంట్ కోరినా స్పందించలేదు
- బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు

2

# ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

### పోలీసులకు హైకోర్టు ఆదేశాలు

- అసెంబ్లీ వద్ద సోమవారం ఘటనలపై హోంశాఖకు నోటీసులు
- మహిళా ఎమ్మెల్యేలపై దాడి ఆరోపణలపై విచారణకు ఆదేశం
- బాధ్యులైన పోలీసులను గుర్తించి చర్యలు తీసుకోవాలి
- ఘటనపై డీజీపీ నివేదిక ఇవ్వాలని ఆదేశం
- రెండు వారాలకు విచారణ వాయిదా

2



**ప్రజానావ, హైదరాబాద్:** అసెంబ్లీ వద్ద సోమవారం ఉదయం చోటుచేసుకున్న పరిణామాలపై తెలంగాణ హైకోర్టు స్పందించింది. ఈ ఘటనకు సంబంధించి రాష్ట్ర హోంశాఖకు నోటీసులు జారీ చేసింది. అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోవద్దని స్పష్టం చేసింది. ఎమ్మెల్యేలు నిబంధనలు ఉల్లంఘించినట్లు భావిస్తే ఆ వ్యవహారాన్ని స్పీకర్ చూసుకుంటారని, పోలీసులు వారిపై చర్యలు తీసుకోరాదని ఆదేశించింది.

**మహిళా ఎమ్మెల్యేలపై దాడి ఆరోపణలపై విచారణ**

మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులను

## రూ.1.10 లక్షల కోట్ల సైనిక
# కొనుగోళ్లకు పచ్చజెండా

- త్రివిధ దళాల సామర్థ్యాల పెంపునకు రక్షణశాఖ కీలక నిర్ణయం
- రాడార్లు, హెలికాప్టర్లు, మైన్ లేయర్లు సహా అధునాతన పరికరాల కొనుగోలు
- 98 శాతం సామగ్రి దేశీయంగానే సమకూర్చుకునేలా ప్రణాళిక

2





## యూట్యూబర్
# నందన అరెస్ట్

- లుకౌట్ నోటీసుల నేపథ్యంలో శంషాబాద్‌లో అదుపులోకి
- లండన్‌లో ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు
- ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించిన అధికారులు

2

# గంటలో 34 పోస్టులు

- ట్రంప్ తీరుపై ప్రపంచవ్యాప్తంగా చర్చ
- ఏఐ చిత్రాలు, ఆసక్తికర వ్యాఖ్యలతో పోస్టులు
- 'బై బై ఖర్గ్' అంటూ ఇరాన్ చమురు కేంద్రమైన ద్వీపంపై ప్రస్తావన
- ఇరాన్ పటంపై తన ముఖంతో ఏఐ చిత్రం.. 'చంద్రుడు మాకే సొంతం' అంటూ మరో పోస్టు
- 'న్యూ మెక్సికో'కు బదులుగా 'న్యూ అమెరికా' అంటూ ఫొటో షేర్

2





## పోలీసులపై దాడి చేస్తే అధికారంలోకి వస్తామనుకోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టంగా కనిపించాయని శ్రీధర్‌బాబు అన్నారు. కేటీఆర్ పోలీసుపై చేయి చేసుకున్నట్లు కనిపించిందని వ్యాఖ్యానించారు. పోలీసులపై దాడి చేస్తే అధికారంలోకి వస్తామని తాము ఎప్పుడూ భావించలేదని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు హుందాగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు.

### నిబంధనలకు అనుగుణంగానే స్పీకర్ నిర్ణయం

బీఆర్‌ఎస్ సభ్యుల తీరు చాలా దారుణంగా ఉందని మంత్రి విమర్శించారు. శాసనసభలో బ్యాడ్జీలు ధరించి రావొద్దని, టీషర్టులపై నినాదాలు ఉంటే అనుమతించకూడదని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వమే నిబంధనలు రూపొందించిందని గుర్తుచేశారు. సభా గౌరవాన్ని తగ్గించేలా నినాదాలు ఉన్న టీషర్టులతో బీఆర్‌ఎస్ సభ్యులు రావడం సరికాదన్నారు. సభా నిబంధనలకు అనుగుణంగానే స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ విషయంలో ఒక న్యాయం, తమ విషయంలో మరో న్యాయమా? అని కేటీఆర్ ప్రశ్నిస్తున్నారని, అయితే రాహుల్‌గాంధీ ఎలాంటి నినాదాలు రాసుకున్న టీషర్టుతో లోక్‌సభకు వెళ్లలేదని తెలిపారు. గతంలో సభలో ప్లకార్డులు అనుమతించబోమని చెప్పినప్పుడు తాము వాటిని తీసుకెళ్లలేదని గుర్తుచేశారు. మహిళా సభ్యులకు ఇబ్బంది కలిగిందని తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారని మంత్రి చెప్పారు

### తాతా మధు వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ ఎందుకు ఖండించదు?

స్పీకర్‌పై అత్యంత అభ్యంతరకరమైన భాషను ఉపయోగించడం సరికాదని శ్రీధర్‌బాబు అన్నారు. తాతా మధు సభ్య సమాజం అసహ్యించుకునే విధంగా మాట్లాడారని మండిపడ్డారు. ఈ వ్యవహారంపై కేసీఆర్ స్పందించాల్సిన బాధ్యత ఉందన్నారు. కేసీఆర్ స్పందించకపోతే ఈ వ్యాఖ్యల వెనుక ఆయన ప్రేరణ ఉందనే అనుమానాలు తలెత్తుతాయని వ్యాఖ్యానించారు.తాతా మధు చేసిన వ్యాఖ్యలకు బీఆర్‌ఎస్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఆ వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు.

### క్షమాపణ చెప్పిన తర్వాతే మిగతా కార్యకలాపాలు

స్పీకర్ తల్లిని దూషించేలా వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని మంత్రి ప్రశ్నించారు. తాతా మధు వ్యాఖ్యలతో స్పీకర్ కన్నీరు పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇష్టారాజ్యంగా మాట్లాడటం, పోలీసులను బెదిరించడం, శాసనసభను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. శాసనసభను 'దుశ్శాసన సభ'గా కేటీఆర్ అభివర్ణించడాన్ని శ్రీధర్‌బాబు తప్పుపట్టారు. మహిళల గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్‌ఎస్‌కు లేదని విమర్శించారు. మహిళా మంత్రి లేకుండానే ఐదేళ్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వం నడిచిందని వ్యాఖ్యానించారు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెడతామని కేటీఆర్ బెదిరిస్తున్నారని, అయితే ఇలాంటి బెదిరింపులకు కాంగ్రెస్ భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ సభ్యులు స్పీకర్‌కు క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పిన తర్వాతే మిగతా శాసనసభ కార్యకలాపాలు కొనసాగుతాయని తెలిపారు. జరిగిన తప్పును అంగీకరించే మనస్తత్వం బీఆర్‌ఎస్ సభ్యులకు ఉండాలని శ్రీధర్‌బాబు అన్నారు.

## స్పీకర్‌ను అవమానించలేదు

**ప్రజానావ, హైదరాబాద్:** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అంటే తనకు ఎంతో గౌరవముందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పష్టం చేశారు. స్పీకర్‌ను ఉద్దేశించి తాను ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని, అనని మాటలను తనకు ఆపాదించడం సరికాదని అన్నారు. తన వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవిగా భావిస్తే వాటిని ఉపసంహరించుకుంటున్నానని, అందుకు విచారం వ్యక్తం చేస్తున్నానని తెలిపారు.

### 'స్పీకర్‌ను నేనేమీ అనలేదు'

''స్పీకర్‌ను నేనేమీ అనలేదు. ఆయనను అన్నట్లు భావిస్తే నా వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నా. నా మాటలపై విచారం వ్యక్తం చేస్తున్నా. అసెంబ్లీ వద్ద నాపై దాడి చేసి గొంతు నొక్కే ప్రయత్నం చేశారు. నాపై దాడి చేసిన వారిని మాత్రమే ఆవేశంతో అన్నాను'' అని తాతా మధు వివరణ ఇచ్చారు.

### వ్యాఖ్యలపై తీవ్ర రాజకీయ దుమారం

అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న పరిణామాల సందర్భంగా తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ నేతలు ఆరోపించడంతో తీవ్ర రాజకీయ దుమారం రేగింది. శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఆయన వ్యాఖ్యలను ఖండించారు. తాతా మధుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సైతం తాతా మధు వ్యాఖ్యలను ఖండించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో తాతా మధు స్పందించి తన వైఖరిని స్పష్టం చేశారు. అసెంబ్లీ వద్ద బీఆర్‌ఎస్ సభ్యులను పోలీసులు అడ్డుకున్న సమయంలో చోటుచేసుకున్న పరిణామాలపై తాను ఆవేశానికి గురయ్యానని తాతా మధు తెలిపారు. తనపై దాడి చేసి గొంతు నొక్కే ప్రయత్నం చేసిన వారిని ఉద్దేశించే ఆ వ్యాఖ్యలు చేశానని చెప్పారు. స్పీకర్ పదవిని, స్పీకర్‌ను అవమానించే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. స్పీకర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలుగా ఎవరైనా భావించిన పక్షంలో వాటిని వెనక్కి తీసుకుంటున్నానని, తన మాటల వల్ల మనస్తాపం కలిగితే విచారం వ్యక్తం చేస్తున్నానని తాతా మధు పేర్కొన్నారు.

## రూ.1.10 లక్షల కోట్ల సైనిక కొనుగోళ్లకు పచ్చజెండా



**న్యూఢిల్లీ:** భారత త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రూ.1.10 లక్షల కోట్ల విలువైన సైనిక సామగ్రి, ఆయుధ వ్యవస్థల కొనుగోళ్లకు రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) ఆమోదం తెలిపింది. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు పలు ప్రతిపాదనలకు పచ్చజెండా ఊపారు. మొత్తం కొనుగోళ్లలో 98 శాతం దేశీయంగానే చేపట్టనున్నారు.

### సైన్యానికి అధునాతన సామగ్రి

భారత సైన్యం కోసం సీబీఆర్‌ఎన్ నిఘా వాహనాలు, మెకానికల్ మైన్ లేయర్లు, తేలికపాటి హెలికాప్టర్లు, ట్రాల్ ట్యాంకులు, 'సర్వత్ర' వంతెన వ్యవస్థలను సమకూర్చుకునేందుకు డీఏసీ ఆమోదం తెలిపింది. సీబీఆర్‌ఎన్ నిఘా వాహనాలు రసాయన, జీవ, రేడియోలాజికల్, అణు ముప్పులను గుర్తించేందుకు ఉపయోగపడనున్నాయి.

### నౌకాదళానికి ఆరుద్ర రాడార్లు

నౌకాదళం కోసం ఆరుద్ర రాడార్లు, మెరైన్ గ్యాస్ టర్బైన్ల కొనుగోలుకు అనుమతి లభించింది. అధునాతన రాడార్ వ్యవస్థలతో నిఘా, పర్యవేక్షణ సామర్థ్యాలు మరింత మెరుగుపడనున్నాయి. వైమానిక దళానికి చెందిన యుద్ధ, రవాణా విమానాలు, హెలికాప్టర్ల యుద్ధ సామర్థ్యాన్ని పెంచేందుకు ఉద్దేశించిన పలు ప్రతిపాదనలకు కూడా డీఏసీ ఆమోదం తెలిపింది. అదేవిధంగా గ్రౌండ్ బేస్డ్ మల్టీపర్పస్ జామర్ కొనుగోలు, డిఫెన్స్ ఫోర్సెస్ సెక్యూర్ యాక్సెస్ కార్డు వ్యవస్థ ఏర్పాటుకు రక్షణశాఖ అనుమతి మంజూరు చేసింది. దేశీయ రక్షణ ఉత్పత్తులకు మరింత ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు త్రివిధ దళాల ఆధునికీకరణను వేగవంతం చేసేలా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు రక్షణశాఖ వర్గాలు తెలిపాయి.

# స్పీకర్‌ను అవమానిస్తే సహించం

(మొదటి పేజీ తరువాయి)

అవమానం గతంలో ఎప్పుడూ జరగలేదని వ్యాఖ్యానించారు. ఇలాంటి భాషను ఉపయోగించిన సభ్యుడిని డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. తాను అన్ని సభలను చూశానని, అయితే ఇంత అభ్యంతరకరమైన భాషను ఎప్పుడూ చూడలేదని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇలాంటి ఘటనలను క్షమిస్తే చట్టసభలకు గౌరవం, మర్యాద లేకుండా పోతాయని పేర్కొన్నారు. అసభ్యకర భాషను ఉపయోగించిన సభ్యుడితో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు.

### పథకం ప్రకారమే జరిగిందని ఆరోపణ

వాయిదా అనంతరం శాసనసభ తిరిగి ప్రారంభమైన తర్వాత స్పీకర్‌కు జరిగిన అవమానంపై చర్చ జరపాలని ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం తెలిపారు. అయితే ముందుగా 22ఏ అంశంపై చర్చ జరపాలని బీజేపీ సభ్యులు పట్టుబట్టడాన్ని ఆయన తప్పుపట్టారు. బీఆర్‌ఎస్ నేతలు చేసిన ఆరోపణలను బీజేపీ సభ్యులు ఎందుకు మోస్తున్నారని ప్రశ్నించారు. స్పీకర్‌ను అవమానించిన రోజు తెలంగాణకు చీకటి రోజని, నాలుగు కోట్ల ప్రజలకు అవమానం జరిగిన రోజని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్ తన ఎమ్మెల్యేలను ముందురోజు పిలిపించి స్పీకర్‌పై ఉసిగొల్పారని ఆరోపించారు. ఈ ఘటన అనుకోకుండా జరిగినది కాదని, పథకం ప్రకారమే జరిగిందని ఆయన పేర్కొన్నారు.

### 'చర్చకు మేం సిద్ధం'

స్పీకర్‌ను అవమానించడం అంటే వైద్యం చేసే వైద్యుడినే గాయపరిచినట్లుగా ఉందని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సభాపతికి జరిగిన అవమానాన్ని మొత్తం శాసనసభకు జరిగిన అవమానంగానే పరిగణించాలని అన్నారు. ఈ అంశంపై చర్చకు బీజేపీ సభ్యులు సహకరించాలని కోరారు. స్పీకర్ అంశంపై చర్చ పూర్తయిన తర్వాత ఏ ఇతర అంశంపైనైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

"స్పీకర్‌కు జరిగిన అవమానం సభకు జరిగిన అవమానంగానే భావించాలి. స్వతంత్ర భారతంలో ఇలాంటి అవమానం గతంలో ఎప్పుడూ జరగలేదు. ఇలాంటి భాష వాడిన సభ్యుడిని డిస్మిస్ చేయాలి. ఇలాంటి వాటిని క్షమిస్తే చట్టసభలకు గౌరవం, మర్యాద ఉండదు. అసభ్యకర భాషను వాడిన సభ్యుడితో కేసీఆర్ రాజీనామా చేయించాలి."

### తాతా మధును బర్తరఫ్ చేయాలి: మహేశ్వర్‌రెడ్డి

సీఎం వ్యాఖ్యలపై బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి స్పందించారు. స్పీకర్‌పై తాతా మధు ఉపయోగించిన భాషను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. స్పీకర్‌పై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన సభ్యుడిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. తాతా మధు వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ కేసీఆర్ క్షమాపణ చెప్పాలని కోరారు. "స్పీకర్‌పై తాతా మధు వాడిన భాషను బీజేపీ ఖండిస్తోంది. అసభ్యకర భాషను ఉపయోగించిన సభ్యుడిని బర్తరఫ్ చేయాలి. మధు వ్యాఖ్యలకు బాధ్యతగా కేసీఆర్ క్షమాపణ చెప్పాలి."

### కేసీఆర్ క్షమాపణ చెప్పాలి: సీతక్క

బీఆర్‌ఎస్ సభ్యుల తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందని మంత్రి సీతక్క విమర్శించారు. స్పీకర్‌పై అత్యంత అభ్యంతరకరమైన భాషను ఉపయోగించారని ఆరోపించారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ చట్టాల కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తాతా మధు చేసిన వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ క్షమాపణ చెప్పాలని సీతక్క కోరారు.

## బోనాల నాటికి ఇందిరమ్మ ఇళ్లు

- ఇళ్ల కేటాయింపునకు నియోజకవర్గాన్ని యూనిట్‌గా పరిగణిస్తున్నాం
- లబ్ధిదారులకు మార్కెట్ ధర కంటే తక్కువకే సిమెంట్ సరఫరా
- శాసన మండలిలో మంత్రి పొంగులేటి

ప్రజానావ, హైదరాబాద్: వచ్చే బోనాల పండుగ నాటికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుంటున్నామని శాసన మండలిలో వెల్లడించారు. లబ్ధిదారులకు మార్కెట్ ధర కంటే తక్కువ రేటుకే సిమెంట్ అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పేదలు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి అందిస్తామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పేదల నివాస ప్రాంతాలకు 30–40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లను నిర్మించారని విమర్శించారు. దీంతో లబ్ధిదారులు అక్కడ నివసించేందుకు ఆసక్తి చూపలేదని పేర్కొన్నారు.

### గత ప్రభుత్వంపై విమర్శలు

2023 ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్ ప్రభుత్వం హడావుడిగా కొంతమందికి పట్టాలు ఇచ్చిందని పొంగులేటి ఆరోపించారు. ఆ ఇళ్లలో ప్రస్తుతం చాలామంది నివసించడం లేదని తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసించే వారిని గత ప్రభుత్వం అంటరానివారిగా చూసినట్లుగా వ్యవహరించిందని విమర్శించారు. పేదలకు ఇల్లు కేవలం నిర్మాణంగా కాకుండా.. వారు నివసించే ప్రాంతానికి దగ్గరగా, అవసరమైన మౌలిక వసతులతో అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై పోరు ఆగదు

**ప్రజానావ, హైదరాబాద్:** ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం బీజేపీ నిరంతరం పోరాటం చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తెలిపారు. విద్యార్థుల సమస్యను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యార్థుల సంతకాలతో ముఖ్యమంత్రిని కలిసి సమస్యను వివరించేందుకు అవకాశం కోరినా స్పందించలేదని అన్నారు. విద్యార్థుల సమస్యపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. సోమవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, 22–ఏ భూముల సమస్యలపై శాసనసభలో చర్చ జరగకుండా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాటకాలాడుతున్నాయని రాంచందర్‌రావు ఆరోపించారు. ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకే ఇరు పార్టీలు ప్రయత్నిస్తు న్నాయని విమర్శించారు. ''ఒకరు నల్ల డ్రెస్, మరొకరు తెల్ల డ్రెస్ వేసుకుని తిట్టుకున్నట్లు నటించడం తప్ప.. ప్రజల సమస్యలపై చర్చ మాత్రం జరగడం లేదు'' అని అన్నారు. స్పీకర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను బీజేపీ ఖండించిందని తెలిపారు. కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, అధికార పక్షం బీజేపీ సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని రాంచందర్‌రావు విమర్శించారు. ''ప్రజల సమస్యలపై ఎవరు మాట్లాడాలి?'' అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండూ ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు.

### బకాయిలు చెల్లించే వరకు పోరాటం

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విద్యార్థులకు చేరే వరకు తమ పోరాటం కొనసాగుతుందని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. ఈ అంశంపై బీజేపీ ఢిల్లీ నాయకత్వం కూడా పూర్తి నివేదిక కోరిందని తెలిపారు. తెలంగాణలో జరుగుతున్న పరిణామాలను జాతీయ నాయకత్వానికి వివరించినట్లు వెల్లడించారు.

## మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దురుసు ప్రవర్తన

**ప్రజానావ, హైదరాబాద్:** అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. పోలీసుల తీరును రాష్ట్ర ప్రజలంతా చూశారని అన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

### 'సబితపై దాడికి సీఎం బాధ్యత వహించాలి'

సబితా ఇంద్రారెడ్డిని పోలీసులు జుట్టు పట్టుకుని, గొంతు నొక్కే ప్రయత్నం చేశారని కేటీఆర్ ఆరోపించారు. ఆమెపై దాడికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కోవా లక్ష్మి అడ్డుకోకపోయి ఉంటే సునీతా లక్ష్మారెడ్డి ఇనుప కంచెలపై పడిపోయేవారని అన్నారు. అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాలను 'దుశ్శాసన పర్వం'గా కేటీఆర్ అభివర్ణించారు. ''డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్, డైవర్షన్ మాత్రమే రేవంత్‌రెడ్డికి తెలుసు. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని కప్పిపుచ్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు'' అని విమర్శించారు. తమను అసెంబ్లీలోకి రాకుండా అడ్డుకోవాలని స్పీకర్ ఆదేశించారని పోలీసులు చెబుతున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పే వరకు ఈ అంశాన్ని వదిలిపెట్టబోమని కేటీఆర్ స్పష్టం చేశారు. హోంమంత్రిగా కూడా ఉన్న రేవంత్‌రెడ్డి ఈ ఘటనపై బాధ్యత వహించి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఘటనపై జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు అనేకం ఉన్నాయని, వాటిపై చర్చించేందుకు అసెంబ్లీ సమావేశాలను నెల రోజుల పాటు నిర్వహించాలని కేటీఆర్ కోరారు. ముఖ్యమంత్రిని విమర్శిస్తే మైక్ ఇవ్వబోమని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు.

**స్పీకర్‌పై అవిశ్వాసంపై ఆలోచన**

స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలిస్తామని కేటీఆర్ తెలిపారు. తమను నిలదీస్తారనే భయంతోనే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి రాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనను రాజకీయంగా వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు.

## యూట్యూబర్ నందన అరెస్ట్



**ప్రజానావ, హైదరాబాద్:** ప్రముఖ యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై లుకౌట్ నోటీసులు పెండింగ్‌లో ఉండటంతో విమానాశ్రయానికి వచ్చిన సమయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎయిర్‌పోర్ట్ పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని, అనంతరం ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు.

### లండన్ ఉద్యోగాల పేరుతో మోసం చేశారనే ఆరోపణలు

నందన, ఆమె భర్త కలిసి లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురిని నమ్మించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో భాగంగానే నందనపై లుకౌట్ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది.

### ఇమ్మిగ్రేషన్ అధికారుల సమాచారంతో..

సోమవారం శంషాబాద్ విమానాశ్రయానికి నందన వచ్చిన సమయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు ఆమెను గుర్తించారు. అనంతరం ఎయిర్‌పోర్ట్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు వెంటనే ఆమెను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్న ఇబ్రహీంపట్నం పోలీసులకు ఆమెను అప్పగించారు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడయ్యే అవకాశం ఉంది. నందన, ఆమె భర్తపై వచ్చిన ఆరోపణలు, వసూలు చేసినట్లు చెబుతున్న మొత్తంపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

## గంటలో 34 పోస్టులు



**న్యూయార్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో వరుస పోస్టులతో మరోసారి చర్చనీయాంశంగా మారారు. గంట వ్యవధిలోనే ఏకంగా 34 పోస్టులు చేసిన ఆయన.. ఏఐతో రూపొందించిన చిత్రాలు, ఆసక్తికర వ్యాఖ్యలను పంచుకున్నారు. ముఖ్యంగా ఇరాన్ అంశంపై ట్రంప్ చేసిన వరుస పోస్టులు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

### 'బై బై ఖర్గ్' అంటూ..

ఇరాన్ కీలక చమురు ఎగుమతి కేంద్రంగా ఉన్న ఖర్గ్ ద్వీపాన్ని ప్రస్తావిస్తూ ట్రంప్ 'బై బై ఖర్గ్' అంటూ ఓ పోస్టు చేశారు. దీనికి తోడు ఇరాన్ పటంపై తన ముఖం ప్రతిబింబించేలా రూపొందించిన ఏఐ చిత్రాన్ని కూడా ఆయన పంచుకున్నారు. ఈ పోస్టులు ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా చర్చకు దారితీశాయి.

### 'చంద్రుడు మాకే సొంతం'

ఇక మరో పోస్టులో 'చంద్రుడు మాకే సొంతం' అంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు. అంతేకాకుండా అమెరికాలోని న్యూ మెక్సికో రాష్ట్రానికి సంబంధించిన ఓ సూచిక బోర్డును 'న్యూ అమెరికా'గా మార్చినట్లు కనిపించే చిత్రాన్ని షేర్ చేశారు.

### పేరు మార్పుపై అధికారిక ఉత్తర్వులు లేవు

అయితే న్యూ మెక్సికో రాష్ట్రం పేరును 'న్యూ అమెరికా'గా మార్చుతూ ట్రంప్ ఎలాంటి అధికారిక ఉత్తర్వులు జారీ చేయలేదు. దీంతో ఈ పోస్టు కూడా ఆసక్తికర చర్చకు కారణమైంది. ఇదిలా ఉండగా.. ట్రంప్ గతంలో పలు భౌగోళిక పేర్ల మార్పునకు చర్యలు చేపట్టారు. గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును 'గల్ఫ్ ఆఫ్ అమెరికా'గా మార్చేలా ఆయన ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా గంట వ్యవధిలో ట్రంప్ చేసిన వరుస పోస్టులు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు దారితీశాయి.

## రేవంత్ విద్యా వ్యవస్థను దెబ్బ తీస్తున్నడు

**ప్రజానావ, హన్మకొండ:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో సోమవారం హన్మకొండలో భారీ ఆందోళన జరిగింది. అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు వేలాది మంది విద్యార్థులతో కలిసి ఆమె సుమారు మూడు కిలోమీటర్ల మేర ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థులతో కలిసి కలెక్టర్‌ను కలిసేందుకు తొలుత పోలీసులు అనుమతించకపోవడంతో కవిత, విద్యార్థులు అరగంటకు పైగా అక్కడే నిరసన తెలిపారు. అనంతరం అధికారులు వారిని కలెక్టరేట్‌లోకి అనుమతించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సర్కిల్, కలెక్టరేట్ వద్ద విద్యార్థులను ఉద్దేశించి కవిత మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.13 వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాల్సి ఉందని ఆమె తెలిపారు. బకాయిల విడుదలకు కాలపరిమితిని నిర్ణయించి, ఆ మేరకు నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### ఇంటర్, పాలిటెక్నిక్ విద్యపై ఆందోళన

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని కవిత ఆరోపించారు. ఇటీవల ఇంటర్మీడియట్ వ్యవస్థను రద్దు చేస్తామనే వ్యాఖ్యలు చేశారని, ఇప్పుడు పాలిటెక్నిక్ విద్య కూడా ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా విద్యార్థుల చదువులు, భవిష్యత్తు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో ఫీజులు చెల్లించక పోవడంతో పేద విద్యార్థులు, ముఖ్యంగా బాలికలు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని కవిత అన్నారు. ప్రొఫెషనల్ కోర్సులు, డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులకు కూడా కొన్ని కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో వారు ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై తాను గతంలో శాసనమండలిలో ప్రశ్నించినప్పుడు ప్రతి నెలా బకాయిలు చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని కవిత గుర్తు చేశారు. ఆ హామీని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిలబెట్టుకోలేదని ఆరోపించారు.

### కలెక్టర్‌కు వినతిపత్రం

కలెక్టరేట్‌లో హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్



బాజ్‌పాయ్‌ను కవిత, విద్యార్థులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. కోర్సులు పూర్తి చేసినప్పటికీ సర్టిఫికెట్లు అందక ఇబ్బందులు పడుతున్న విద్యార్థుల పరిస్థితిని ఆమె వివరించారు. ఈ సమస్యపై ప్రజావాణిలోనూ విద్యార్థులు ఫిర్యాదు లు చేస్తున్నారని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. సర్టిఫికెట్లు ఇవ్వని కళాశాలల యాజమాన్యాలతో మాట్లాడి విద్యార్థులకు వాటిని అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రేటర్ వరంగల్ ఎన్నికల్లో అన్ని డివిజన్ల నుంచి తమ పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపుతామని కవిత తెలిపారు. వరంగల్ నుంచే తెలంగాణ రక్షణ సేన జైత్రయాత్ర ప్రారంభమవుతుందని అన్నారు. హన్మకొండ జిల్లా తరాలపల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరించిన ఆమెకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం ఉచితంగా అందించాలన్నదే తమ లక్ష్యమని కవిత చెప్పారు. సామాజిక న్యాయంతో పాటు ప్రజలకు మేలు జరిగేలా పనిచేయాలనే సంకల్పంతో కొత్త పార్టీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### అయోధ్యపురం నిర్వాసితులకు అండ

అయోధ్యపురం రైతుల పరిస్థితి వనవాసానికి వెళ్లినట్టుగా తయారైందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం అయోధ్యపురంలోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఆమె సందర్శించి భూనిర్వాసితులతో మాట్లాడారు. దేవాదాయ శాఖ భూములతో తమ భూములు కలిసి ఉండటంతో పరిహారం విషయంలో అన్యాయం జరిగిందని నిర్వాసితులు కవిత దృష్టికి తీసుకెళ్లారు. గతంలో డీజిల్ ఫ్యాక్టరీ కోసం భూసేకరణ చేసినప్పుడు పరిహారంలో 90 శాతం తమకు, 10 శాతం దేవాదాయ శాఖకు ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం ఎకరాకు రూ.33 లక్షల పరిహారం ప్రకటించినప్పటికీ తమకు రూ.8 లక్షలు మాత్రమే అందుతున్నాయని, మిగిలిన మొత్తాన్ని దేవాదాయ శాఖకు కేటాయిస్తున్నారని వివరించారు. భూనిర్వాసితులకు న్యాయం జరిగేలా పోరాడతామని కవిత హామీ ఇచ్చారు.

### పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

తరాలపల్లిలోని పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలోనూ కవిత పాల్గొన్నారు. అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆమెకు ఆశీర్వచనాలు అందించారు.

### ఎమ్మెల్యేలపై పోలీసుల తీరుపై విమర్శలు

తెలంగాణ అసెంబ్లీ వద్ద మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు దుర్మార్గంగా ఉందని కవిత విమర్శించారు. సీనియర్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించారని ఆరోపిస్తూ 'ఎక్స్' వేదికగా స్పందించారు. మహిళా ఎమ్మెల్యేలకే భద్రత లేకపోతే సామాన్య మహిళల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో మహిళలపై హింస, దాడులు పెరుగుతున్నా యని ఆమె ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా వ్యవహరించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### కొడంగల్ పాంచజన్య సంకల్ప సభకు ఇన్‌ఛార్జ్‌ల నియామకం

కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో నిర్వహించే తెలంగాణ రక్షణ సేన పాంచజన్య సంకల్ప సభ సమన్వయం కోసం పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ఇన్‌ఛార్జీలను నియమించారుకొడంగల్ పాంచజన్య సంకల్ప సభ ఇన్ ఛార్జీలుగా పార్టీ సీనియర్ నాయకులు అర్చన సేనాపతి, గద్వాల నియోజకవర్గ ఇన్ ఛార్జి గొంగళ్ల రంజిత్ కుమార్, కోరుట్ల నియోజకవర్గ ఇన్ ఛార్జి చిట్టినేని రఘును నియమించారుపార్టీ నాయకులను సమన్వయం చేసుకుంటూ కొడంగల్ పాంచజన్య సంకల్ప సభ విజయవంతానికి కృషి చేయాలని సూచించారు.

## అసెంబ్లీ చరిత్రలో నేడు బ్లాక్ డే

**ప్రజానావ, హైదరాబాద్:** అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్ సభ్యులు అసెంబ్లీలోకి రాకుండా ప్రభుత్వం అడ్డుకుంటోందని మండిపడ్డారు. ప్రతిపక్షం లేకుండానే శాసనసభలో చర్చలు జరపాలని చూస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాల అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ టీషర్టులు ధరించి పార్లమెంట్‌కు వెళ్లిన విషయాన్ని హరీశ్‌రావు ప్రస్తావించారు. వారు టీషర్టులతో పార్లమెంట్‌కు వెళ్లినప్పుడు తాము టీషర్టులతో అసెంబ్లీకి రావడంలో తప్పేముందని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ సభ్యులు ధరించిన నల్ల టీషర్టులపై ప్రభుత్వ హామీలను అమలు చేయాలని మాత్రమే ఉందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు తమకు ఉందన్నారు.

### మహిళా ఎమ్మెల్యేలపై అనుచితంగా వ్యవహరించారని ఆరోపణ

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించారని హరీశ్‌రావు ఆరోపించారు. ఆమె చీర లాగితే చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించారు. తమ ఎమ్మెల్యేల గొంతు నొక్కినా మౌనంగా ఉండాలా? అని నిలదీశారు. తెలంగాణ శాసనసభ చరిత్రలో ఈ రోజు బ్లాక్ డేగా మిగిలిపోతుందని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ఇది శాసనసభా? లేక కౌరవ సభా? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డిల పట్ల అనుచితంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### కేటీఆర్‌కు గాయాలయ్యాయి

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కూడా గాయాలయ్యాయని హరీశ్‌రావు ఆరోపించారు. ఆయన చేతి, ముఖంపై గాయాలు కనిపించాయని తెలిపారు. ఆసుపత్రికి తీసుకెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కింద పడేసేలా పోలీసులు వ్యవహరించారని విమర్శించారు. తమ పార్టీ నేతలు, ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును బీఆర్‌ఎస్ తీవ్రంగా పరిగణిస్తుందని హరీశ్‌రావు అన్నారు. ఈ ఘటనలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని ఆయన హెచ్చరించారు.

## ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించాలని హైకోర్టు ఆదేశించింది. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

### డీజీపీ నివేదికకు ఆదేశం

అసెంబ్లీ వద్ద జరిగిన మొత్తం ఘటనపై డీజీపీ సమగ్ర నివేదిక సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. ఎమ్మెల్యేల పట్ల పోలీసుల వ్యవహారశైలిపై కూడా నివేదికలో వివరాలు పొందుపరచాలని సూచించింది. రాష్ట్ర హోంశాఖకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు.. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. సోమవారం ఉదయం అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్త పరిణామాల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# గవర్నర్‌ను కలిసిన కాకతీయ వీసీ

- 24వ స్నాతకోత్సవానికి ఆహ్వానం
- నవంబర్‌లో నిర్వహణకు సూత్రప్రాయ అంగీకారం

ప్రజానావ, హనుమకొండ: హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి సోమవారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ శివప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయం నిర్వహించనున్న 24వ స్నాతకోత్సవానికి గవర్నర్‌ను ఉపకులపతి ఆహ్వానించారు. స్నాతకోత్సవాన్ని నవంబర్‌లో నిర్వహించేందుకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా సూత్రప్రాయంగా అంగీకరించినట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తెలిపారు. ఈ సందర్భంగా స్నాతకోత్సవ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, కార్యక్రమ వివరాలను ఉపకులపతి గవర్నర్‌కు వివరించారు. గవర్నర్ సూత్రప్రాయ అంగీకారంతో కాకతీయ విశ్వవిద్యాలయం 24వ స్నాతకోత్సవ నిర్వహణకు మార్గం సుగమమైందని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ కూడా పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ నిరసన
- బాకీ కార్డులతో ప్రజల్లోకి వెళ్లాలి: డీఎస్ రెడ్యానాయక్



ప్రజానావ, మహబూబాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనను నిరసిస్తూ కురవి మండలం సీరోలులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్యానాయక్ మాట్లాడుతూ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ప్రజా సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా "ఎలా దోచుకోవాలి? ఎలా దాచుకోవాలి?" అనే అంశాలపైనే దృష్టి సారించారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు, హామీల అమలుపై ప్రజలకు వాస్తవ పరిస్థితిని వివరించేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు అన్ని గ్రామాల్లో 'బాకీ కార్డులు' పంపిణీ చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఏ మేరకు అమలు జరిగాయో ప్రజలకు వివరించాలని సూచించారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాకముందు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయకపోవడంతో పాటు డీఏలు కూడా ఇవ్వలేదని అన్నారు. రాష్ట్రంలో ప్రతి పనికీ 10 నుంచి 15 శాతం వరకు లంచాలు తీసుకుంటూ పనులు చేస్తున్నారని ఆరోపించారు. డోర్నకల్ ఎమ్మెల్యేను ఉద్దేశించి తాను సీరోలు ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన 'పాడి గేదె' లాంటి వాడినని, ప్రజలు మాత్రం 'దున్నపోతు' లాంటి వ్యక్తికి ఓటు వేసి గెలిపించారని రెడ్యానాయక్ వ్యాఖ్యానించారు. ప్రజలు పాలన, అభివృద్ధి, ఎన్నికల హామీల అమలు తీరును పరిశీలించి భవిష్యత్‌లో నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంపల్లి సొసైటీ మాజీ చైర్‌పర్సన్ కొండపల్లి శ్రీదేవి, కురవి మాజీ వైస్ ఎంపీపీ దొంగలి నర్సయ్య, నాయకులు బోజ్యానాయక్, పెద్ద వెంకన్న, మామిండ్ల వెంకన్న, జైపాల్‌రెడ్డి, మోహన్‌నాయక్, నరహరి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో బీజేపీ పోరాటాన్ని ఆపలేరు

## ఫిలింనగర్ డివిజన్ బీజేపీ నాయకుల డిమాండ్



ప్రజానావ, హైదరాబాద్: విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన రూ.15 వేల కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన బీజేపీ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడాన్ని ఫిలింనగర్ డివిజన్ బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు పిలుపు మేరకు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపేందుకు వెళ్తున్న నాయకులను అడ్డుకుని అరెస్టు చేయడం అణచివేతకు నిదర్శనమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల హక్కుల కోసం ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం, ప్రజా సమస్యలపై గొంతెత్తితే అణచివేయడం సరికాదన్నారు. ఈ సందర్భంగా ఫిలింనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు మేకల గణేష్ యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గుంటి ఆనంద్ సాగర్, బీజేపీ సీనియర్ నాయకుడు బోయ రామాంజనేయులు మాట్లాడుతూ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన రూ.15 వేల కోట్ల నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆపాలని, అక్రమ అరెస్టులను నిలిపివేసి ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలని కోరారు. అరెస్టులతో తమ పోరాటాన్ని అడ్డుకోలేరని, విద్యార్థుల హక్కుల కోసం బీజేపీ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేసే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

# మంత్రి అండతో ఇసుకాసురుల ఆగడాలా?

- తుంకుంటలో పంట పొలాల్లో అక్రమ ఇసుక తవ్వకాలు
- అడ్డుకున్న రైతులపై అనుచరుల ఆగ్రహం

ప్రజానావ, నాగర్‌కర్నూల్: కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అక్రమ ఇసుక తవ్వకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 'మాకెవరు అడ్డు.. మమ్మల్ని ఎవరు ఆపేది' అన్నట్లుగా ఇసుక మాఫియా అక్రమ తవ్వకాలకు పాల్పడుతోందని ప్రతిపక్షాలు, బాధితులు ఆరోపిస్తున్నారు. కొల్లాపూర్ నియోజకవర్గం వీపనగండ్ల మండలం తుంకుంట గ్రామంలో మంత్రి జూపల్లి కృష్ణారావు అండదండలతోనే అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. తమ పంట పొలాల్లో అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టడంతో పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ వాటిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా.. జూపల్లి అనుచరులుగా చెప్పుకుంటున్న కొందరు వారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. 'మా పొలాల్లో అక్రమంగా ఇసుక ఎందుకు తవ్వుతున్నారు.. పంట భూములను ఎందుకు నాశనం చేస్తున్నారు?' అంటూ రైతులు ప్రశ్నించగా.. 'మాకు జూపల్లి సార్ చెప్పిండు.. ఏం చేసుకుంటారో చేసుకోండి' అంటూ ఓ వ్యక్తి సమాధానం ఇస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. రైతులు తమ పంట పొలాలు నాశనం అవుతున్నాయని ప్రశ్నిస్తుండగా.. జూపల్లి చెప్పారం టూ సదరు వ్యక్తి సమాధానం ఇవ్వడం ఈ వ్యవహారంపై మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.

# ఎల్‌నినో ఎఫెక్ట్.. పంటలకు ముప్పు!

- తగ్గుతున్న భూగర్భజలాలు
- ఎండుతున్న వరి, వాడిపోతున్న పత్తి
- సెప్టెంబర్‌లోనూ మండుతున్న ఎండలు



ప్రజానావ, నల్లగొండ: వర్షాలతో పచ్చని పంటలతో కళకళలాడాల్సిన సమయంలో ఎల్‌నినో ప్రభావం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఓ వైపు భూగర్భజలాలు తగ్గుముఖం పట్టడంతో బోర్లు నీరు పోయడం లేదు. దీంతో ఇప్పటికే నాట్లు వేసిన వరి పొలాలు ఒక్కో మడి చొప్పున ఎండుముఖం పడుతున్నాయి. పత్తి పైర్లు సైతం వాడిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మరో నెల రోజుల్లో పంటలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పలువురు రైతులు, వ్యవసాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దీనికి తోడు గతంలో ఎన్నడూ లేని విధంగా సెప్టెంబరులోనూ ఎండలు మండిపోతుండటం జనజీవనంపై ప్రభావం చూపుతోంది. వేసవిని తలపించే ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు వేడిమిని తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల వరకు చేరుకోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అత్యధికంగా నల్గొండ జిల్లా చందంపేట మండలం తెల్దేవరపల్లిలో 39.1 డిగ్రీలు, సూర్యాపేట జిల్లా మునగాలలో 38.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో మిగతా రెండు జిల్లాలతో పోలిస్తే ఉష్ణోగ్రతలు కొంత తక్కువగా ఉండటంతో ప్రజలకు కాస్త ఊరట లభించింది. ఇదిలా ఉండగా ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడ చిరుజల్లులు కురుస్తున్నాయి. పగటి వేళ మండుతున్న ఎండలతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, సాయంత్రం కురుస్తున్న చిరుజల్లులు కొంత ఉపశమనం కలిగిస్తున్నాయి. అయితే పంటలకు అవసరమైన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, భూగర్భజలాలు పడిపోవడం రైతులకు ప్రధాన సమస్యగా మారింది.

# పాఠశాలలో కేబుల్ చోరీ

## 100 మీటర్ల సర్వీస్ కేబుల్ అపహరణ

ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ పంచాయతీ ప్రాథమిక పాఠశాలలో గుర్తుతెలియని వ్యక్తులు సుమారు 100 మీటర్ల సర్వీస్ కేబుల్‌ను కత్తిరించి అపహరించారు. సోమవారం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు చోరీని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా పాఠశాల ఆవరణలో రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల పరిసరాల్లో గంజాయి ప్యాకెట్లు కనిపించడంతో పాటు కొందరు మద్యం సేవిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని వారు చెబుతున్నారు. చిన్నారులు వినియోగించే టాయిలెట్ల తలుపులు సైతం చోరీకి గురైనట్లు పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల్లో తరచూ దొంగతనాలు జరుగుతున్నప్పటికీ ఫిర్యాదులు స్వీకరించడానికే అధికారులు పరిమితమవుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని వాపోతున్నారు. టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉండటంతో పోలీసు పర్యవేక్షణపైనా విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రివేళ పెట్రోలింగ్‌ను పెంచడంతో పాటు పాఠశాల పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఖాళీగా ఉన్న ఇన్‌స్పెక్టర్ పోస్టును వెంటనే భర్తీ చేసి శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. చోరీ విషయం తెలుసుకున్న రుద్రంపూర్ సర్పంచ్ బానోత్ కేస్లీ, వార్డు సభ్యుడు ఫయాజ్ పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకునేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఉపాధ్యాయులు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టుపై నిరసన

- నల్ల బ్యాడ్జీలతో ధర్నా
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపాటు
- సీఎం రేవంత్‌కు ప్రజాక్షేత్రంలో బుద్ధి చెబుతాం: బీఆర్ఎస్




ప్రజానావ, యాదాద్రి భువనగిరి: అసెంబ్లీలోకి వెళ్లకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై పోలీసులు దాడి చేసి అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ భూదాన్ పోచంపల్లిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఆందోళన నిర్వహించారు. నేతాజీ ప్రధాన చౌరస్తా వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించకుండా ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై పోలీసుల దాడులు, అరెస్టులు ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనన్నారు. మహిళా ప్రజాప్రతినిధి పట్ల పోలీసులు వ్యవహ రించిన తీరు దారుణమని, మహిళను చీర పట్టుకుని లాగడం ఏమిటని ప్రశ్నించారు. పోలీసులు పద్ధతిగా, సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజాక్షేత్రంలో సీఎం రేవంత్‌రెడ్డికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పతనం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కందాల భూపాల్‌రెడ్డి, కౌన్సిలర్ బాతుక లింగస్వామి, కుడికాల అఖిల బలరాం, మాజీ కౌన్సిలర్ గుండు మధు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చిలువేరు బాల నరసింహ, పట్టణ కార్యదర్శి సీత శ్రీనివాస్, నాయకులు కందాల సుధాకర్‌రెడ్డి, మునుకుంట్ల బాలచందర్, కర్నాటి నరసింహ, మంగళపల్లి శ్రీహరి, చింతకింది కిరణ్, పగిడిమర్రి రాజు, నోముల ఉపేందర్‌రెడ్డి, కొండమడుగు రవి, కర్నాటి అంజమ్మ, గుండు రాజేశ్వరి, భారత కల్పన, రమావత్ రాజు, శంకరయ్య, సరసాని నర్సిరెడ్డి, రేవల్లి శ్రీను తదితరులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దు గుట్టలపై మట్టి దొంగల కన్ను

- అనుమతులు లేకుండానే గ్రావెల్ తవ్వకాలు
- వేలాది ట్రిప్పుల మట్టి తరలింపు.. రాయల్టీ కోల్పోతున్న మైనింగ్ శాఖ



ప్రజానావ ఖమ్మం: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులోని గుట్టలపై మట్టి అక్రమార్కుల కన్ను పడింది. ఎలాంటి అనుమతులు లేకుండానే గుట్టలను యథేచ్ఛగా తవ్వుతూ గ్రావెల్, మట్టిని తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల రూ.3.10 కోట్ల నిధులతో నేలకొండపల్లి మండలం అప్పలనరసింహ పురం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేట మండలం గండ్రాయి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో రహదారి నిర్మాణానికి అవసరమైన మట్టి కోసం అప్పలనరసింహపురంలోని సర్వే నంబర్ 342లో ఉన్న గుట్టను గుత్తేదారు ఎంపిక చేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. భారీ యంత్రాలను వినియోగించి పొక్లెయినర్లతో మట్టిని తవ్వి టిప్పర్ల ద్వారా వేలాది ట్రిప్పులు తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతోపాటు మరికొందరు కూడా ఇక్కడి నుంచి మట్టిని ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలకు యథేచ్ఛగా తరలిస్తున్నారని స్థానికులు అంటున్నారు. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం కావడం, అధికారులు తరచూ పర్యవేక్షణకు రాకపోవడం అక్రమార్కులకు అనుకూలంగా మారిందని చెబుతున్నారు. పట్టపగలే పొక్లెయినర్లతో గుట్టలను తవ్వుతూ మట్టిని తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు, రాయల్టీ లేకుండా మట్టి తరలింపుతో మైనింగ్ శాఖకు వేలాది రూపాయల ఆదాయం కోల్పోతున్న పరిస్థితి నెలకొందని స్థానికులు పేర్కొంటున్నారు. మరోవైపు అధిక బరువుతో మట్టి లోడ్ చేసిన టిప్పర్ల రాకపోకలు సాగిస్తుండటంతో గ్రామీణ రహదారులు సైతం దెబ్బతింటున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ మట్టి, గ్రావెల్ తవ్వకాలను అధికారులు వెంటనే అడ్డుకుని, అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# గద్వాల విజయలక్ష్మి కి మోతె శ్రీలత అభినందనలు

- రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్ చైర్‌పర్సన్‌గా సమర్థవంతంగా పనిచేయాలి
- తెలంగాణ అభివృద్ధికి మరింత సేవలందించాలి

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన గద్వాల విజయలక్ష్మిని గ్రేటర్ హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు మోతె శోభన్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని రాష్ట్ర ప్రణాళికా మండలి కార్యాలయంలో విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతల్లో విజయలక్ష్మి విజయవంతంగా రాణిస్తూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రణాళికా ప్రక్రియకు మరింతగా సేవలందించాలని వారు ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రణాళికా మండలి ద్వారా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, దీర్ఘకాలిక ప్రణాళికలు, వివిధ రంగాల్లో సమగ్ర అభివృద్ధికి అవసరమైన విధానాల రూపకల్పనలో కీలకమైన సూచనలు, సలహాలు అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రణాళికా మండలి మరింత బలమైన దిశానిర్దేశం చేయాలని, కొత్త బాధ్యతల్లో గద్వాల విజయలక్ష్మి ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ సమర్థవంతంగా పనిచేయాలని వారు ఆకాంక్షించారు.





# 420 హామీలు.. 6 గ్యారంటీలు ఏమయ్యాయి?

- వెయ్యి రోజులు గడిచినా ఒక్క హామీ అమలు కాలేదు
- ప్రజలను మోసం చేసిన రేవంత్ సర్కార్: బీఆర్ఎస్ నేతలు

ప్రజానావ, నిజామాబాద్: ఎన్నికల సమయంలో 420 హామీలు, ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ నాయకులు తెల్ల రవికుమార్, మోరే కిషన్ మండిపడ్డారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కోటగిరి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 420 హామీలను అమలు చేస్తామని ఎన్నికల సమయంలో ప్రజలకు మాయమాటలు చెప్పిందని, ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఇచ్చిన హామీల్లో ఒక్కదానినీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆడబిడ్డల వివాహాలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలిచామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పాటు తులం బంగారం కూడా అందజేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ హామీలను పక్కన పెట్టిందని ఆరోపించారు. అలాగే ప్రస్తుతం అందుతున్న పింఛన్‌కు అదనంగా మరో రూ.2 వేల చొప్పున పెంచి, ప్రతినెలా రూ.4 వేల పింఛన్ అందజేస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటికీ అమలు చేయలేదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పేర్ల రవికుమార్, మోరే కిషన్, దేవేందర్, పారూక్, నజీర్, కప్ప సంతోష్, మంజునాథ్, యోగేష్, సందీప్, మొగుళప్ప తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలపై రైతుల ఆందోళన

- పంటలు ఎండిపోయే పరిస్థితి
- 15 గంటల సరఫరాకు హామీతో విరమణ

ప్రజానావ, నిర్మల్: నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలో విద్యుత్ కోతలను నిరసిస్తూ వివిధ గ్రామాలకు చెందిన సాగు రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. కుభీర్–భైంసా ప్రధాన రహదారిపై విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రాస్తారోకో నిర్వహించి ధర్నాకు దిగారు. వ్యవసాయ పంటలకు అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం, విద్యుత్ శాఖకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందిస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని రైతులు ఆరోపించారు. రోజులో గంటల తరబడి విద్యుత్ కోతలు విధిస్తుండటంతో కనీసం మూడు, నాలుగు గంటలు కూడా సక్రమంగా సరఫరా కావడం లేదని వాపోయారు. రైతుల రాస్తారోకోతో కుభీర్–భైంసా ప్రధాన రహదారిపై ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ ఏడీఏ అక్కడికి చేరుకుని వ్యవసాయ రంగానికి రోజుకు 15 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో, ధర్నాను విరమించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎన్నిల అనిల్, పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంపల్కర్ నాగేష్, రైతు నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# జటిలమైన రాజకీయ భవిష్యత్తు!

> పరకాల సీటు విషయంలో సుష్మితకు ఆసక్తి ఉందనే వార్తలు వచ్చాయి. కానీ అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డినే మళ్లీ ముందుకు తీసుకెళ్తామని రేవంత్‌రెడ్డి చెప్పడంతో సమస్య మరింత పెరిగింది. సురేఖ మాత్రం తురు చేసిన మాటలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని చెబుతున్నారు. తురు పెద్దదైందని, ఆమె మాటలకు తాను బాధ్యత వహించాల్సిన అవసరం లేదని ఆమె వాదిస్తున్నారు. కానీ కాంగ్రెస్ పెద్దలు మాత్రం పార్టీ విషయంలో క్రమశిక్షణ తప్పక పాటించాల్సిందే అన్న చందంగా వ్యవహరిం చారు. పరకాల పేరు ఈ గొడవలో పదేపదే వినిపించడం వెనుక రాజకీయ లెక్క ఉంది.

ఏదీ తెగేదాకా లాగొద్దనేది పెద్దల వాదన. సమస్యను చిన్నదిగా ఉన్నప్పుడే సామరస్యంగా పరిష్కరించుకుంటే అన్ని సర్దుకుంటాయి. కానీ తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు కొండా సురేఖ వ్యవహారం పెద్ద చర్చగా మారింది. మంత్రి పదవిలో ఉన్న సురేఖను సీఎం రేవంత్‌రెడ్డి బినెట్ నుంచి తప్పించారు. గవర్నర్ డా దీనికి ఆమోదం తెలిపారు. ఆ తర్వాత కొండా సురేఖ శాఖలు సీఎం దగ్గరకు చేరాయి. విమర్శలు, వివర ణలు, రిపోర్టుల తర్జనభర్జన తర్వాత.. కొండా సురేఖ ఎపిసోడ్‌కు ఎండ్ కార్డ్ పడింది.. దీంతో ఒక్కసారిగా కొండా కుటుంబం రాజకీయ భవిష్య త్తుపై చర్చ మొదలైంది. ఈ గొడవ ఒక్కరోజులో మొదలైంది కాదు. కొండా సురేఖ తురు సుష్మిత పటేల్ సీఎం రేవంత్‌రెడ్డిపై బహిరంగంగా విమర్శలు చేయడంతో అసలు గొడవ మొదలైంది. ముఖ్యంగా పరకాల సీటు విషయంలోనే కొండా కుటుంబానికి, రేవంత్‌రెడ్డి వర్గానికి మధ్య దూరం పెరిగిందనే చర్చ ఉంది. పరకాల సీటు విషయంలో సుష్మితకు ఆసక్తి ఉందనే వార్తలు వచ్చాయి. కానీ అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డినే మళ్లీ ముందుకు తీసుకెళ్తామని రేవంత్‌రెడ్డి చెప్పడంతో సమస్య మరింత పెరిగింది. సురేఖ మాత్రం తురు చేసిన మాటలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని చెబుతున్నారు. తురు పెద్దదైందని, ఆమె మాటలకు తాను బాధ్యత వహించాల్సిన అవసరం లేదని ఆమె వాదిస్తున్నారు. కానీ కాంగ్రెస్ పెద్దలు మాత్రం పార్టీ విషయంలో క్రమశిక్షణ తప్పక పాటించాల్సిందే అన్న చందంగా వ్యవహరిం చారు. పరకాల పేరు ఈ గొడవలో పదేపదే వినిపించడం వెనుక రాజకీయ లెక్క ఉంది. కొండా కుటుంబానికి వరంగల్ ప్రాంతంలో చాలా ఏళ్లుగా రాజకీయ పరిచయాలు ఉన్నాయి. అదే సమయంలో రేవంత్‌రెడ్డి అక్కడ తనకు నమ్మకమైన నాయకులను ముందుకు తీసుకెళ్లాలని చూస్తున్నారు. ఇద్దరి దారులు వేర్వేరుగా కనిపించడం తో దూరం పెరిగిందనే మాట వినిపిస్తోంది. సురేఖ డా తనను ప్రభు త్వం పక్కన పెడుతోందని గతంలో కొన్ని సందర్భాల్లో అసంతృప్తి వ్య క్తం చేశారనే వార్తలు వచ్చాయి. అందు తురు చేసిన వ్యాఖ్యలు ఒక్కటే కారణం కాదని, ముందే కొంత దూరం పెరిగి ఉండొచ్చని రాజకీ యంగా చర్చ జరుగుతోంది. అయితే ఇది రాజకీయ అంచనా మాత్ర మే. కొండా సురేఖ కూడా మౌనంగా ఉండలేదు. తనను కావాలనే పక్కన పెట్టారని, తనపై కుట్ర జరిగిందని ఆమె ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరులు, పొంగులేటి శ్రీనివాస్రెడ్డి తదితరులపై డా ఆమె ఆరోపణలు చేశారు. అయితే ఇవన్నీ సురేఖ చేసిన ఆరోపణలే. వాటిని నిజమని నిర్ధారించే ఆధారాలు బయటకు రాలేదు. కాంగ్రెస్ మాత్రం పార్టీ నిర్ణయానికి కట్టుబడి ముందుకు వెళ్లింది. దీంతో మంత్రి పదవి పోయింది. ఇక్కడే అసలు రాజకీయం కనిపిస్తోంది. ఇది వలం ఒక మంత్రి పదవి పోయిన వ్యవహారం మాత్రమే కాదు. పార్టీలో ఎవరికి ఎంత బలం ఉంది, ఎవరితో ఎవరు కలిసి నడుస్తు న్నారు, వచ్చే ఎన్నికల నాటికి ఎవరి మాట ఎంత వరకు చెల్లుతుంది అన్న లెక్కలు కూడా ఇందులో ఉన్నాయి. ఈ వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన ఆరోపణలు కూడా కలకలం రేపాయి. డబ్బుల పంపకానికి సంబంధించిన గొడవ వల్లే సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించారని ఆయన ఆరోపించారు. అవినీతి కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని కూడా ఆయన అన్నారు. అయితే రాజాసింగ్ చెప్పింది ఆరోపణ మాత్రమే. దానికి ఇప్పటివరకు బలమైన ఆధారం బయటకు రాలేదు. సురేఖ కూడా తనపై అలాంటి ఆరోపణలు లేవని చెబుతున్నారు. కాబట్టి ఈ మాటలను రాజకీయ ఆరోపణలుగానే చూడా లి. సురేఖను తప్పించిన తర్వాత ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన పదవుల్లో బీసీ మహిళలకు చోటు కల్పించింది. గద్వాల్ విజయలక్ష్మి, నేరెళ్ల శారద, జీ. సుధారాణిలకు కీలక బాధ్యతలు ఇచ్చారు. ఈ మార్పులను కొందరు రాజకీయంగా చూస్తున్నారు. బీసీ వర్గాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఏర్పడే ప్రభావాన్ని సర్దుబాటు చేసే ప్రయత్నంగా కొందరు భావి స్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఇదే కారణంతో ఈ నియామకాలు చేసిందని అధికారికంగా చెప్పలేదు.తెలంగాణలో మంత్రి పదవిలో ఉండగానే బయటకు వెళ్లాల్సి వచ్చిన సందర్భాలు గతంలోను ఉన్నాయి. సీఆర్ ప్రభుత్వంలో 2015లో తాటికొండ రాజయ్యను మంత్రి పదవి నుంచి తప్పించారు. ఆ తర్వాత 2021లో ఈటల రాజేందర్‌ను డా బినెట్ నుంచి తొలగించారు. ఈటలపై భూముల విషయంలో ఆరోపణలు రావ డంతో ఆయన శాఖను తీసుకుని, ఆ తర్వాత బినెట్ నుంచి బయటకు పం పారు. ఈ ఆరోపణలను ఈటల ఖండించారు. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని కూడా ఆయన అప్పట్లో చెప్పారు. ఇప్పుడు కొండా సురేఖ వ్యవహారం కూడా అదే వరుసలో మరో రాజకీయ ఘటనగా మారింది. అయితే వదు ఘటనలకు వదు వేర్వేరు కారణాలు ఉన్నాయి. అందు వాటి ని ఒ గాటన కట్టడం సరికాదు.మంత్రి పదవి పోయిందంటే కొండా కు టుంబం రాజకీయంగా అయిపోయిందని చెప్పలేం. వరంగల్ ప్రాంతంలో కొండా కుటుంబానికి ఇంకా పరిచయాలు, అనుచరులు ఉన్నారు. సురేఖకు కూడా తనకంటూ రాజకీయ బలం ఉంది. అందు ఇప్పుడు అందరి చూపు కొండా కుటుంబం తర్వాత ఏం చేస్తుందనే దానిపైనే ఉంది. కాంగ్రెస్‌లోనే ఉండి ముందుకు వెళ్తారా, కొంతకాలం మౌనంగా ఉంటారా, లేక మరో దారి చూసుకుంటారా అన్నది కాలమే చెప్పాలి. మొత్తానికి తురు చేసిన వ్యాఖ్యలతో మొదలైన గొడవ, పరకాల సీటు దగ్గర పెరిగిన దూరం, పార్టీలో పెరిగిన గ్యాప్, చివరకు మంత్రి పదవి పోయే వరకు వెళ్లింది. కానీ ఇంతటితో కొండా సురేఖ రాజకీయ కథ ముగియలేదు. కుర్చీ పోయింది. ఇక కొండా కుటుంబం వేసే తర్వాతి అడుగే తెలంగాణ రాజకీయాల్లో అసలు ఆసక్తికరమైన అంశంగా మారనుంది. కానీ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నరు.

> వరంగల్ ప్రాంతంలో కొండా కుటుంబానికి ఇంకా పరిచయాలు, అనుచరులు ఉన్నారు. సురేఖకు కూడా తనకంటూ రాజకీయ బలం ఉంది. అందు ఇప్పుడు అందరి చూపు కొండా కుటుంబం తర్వాత ఏం చేస్తుందనే దానిపైనే ఉంది. కాంగ్రెస్‌లోనే ఉండి ముందుకు వెళ్తారా, కొంతకాలం మౌనంగా ఉంటారా, లేక మరో దారి చూసుకుంటారా అన్నది కాలమే చెప్పాలి. మొత్తానికి తురు చేసిన వ్యాఖ్యలతో మొదలైన గొడవ, పరకాల సీటు దగ్గర పెరిగిన దూరం, పార్టీలో పెరిగిన గ్యాప్, చివరకు మంత్రి పదవి పోయే వరకు వెళ్లింది.



## జాతీయ కరాటే పోటీల్లో తుంగతుర్తి విద్యార్థుల సత్తా

- రెండు స్వర్ణాలు.. మూడు వెండులు.. ఆరు కాంస్య పతకాలు
- విద్యార్థులకు అభినందనల వెల్లువ

**ప్రజానావ, సూర్యాపేట:** జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు మరోమారు సత్తా చాటారు. హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన తైక ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్–2026లో తుంగతుర్తి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రెండు స్వర్ణ పతకాలు, మూడు వెండి పతకాలు, ఆరు కాంస్య పతకాలతో పాటు ప్రశంసాపత్రాలు సాధించారు. కరాటే ప్రత్యేక శిక్షణ నిపుణురాలు బొంకూరి అరుణ ఆధ్వర్యంలో ప్రతిరోజూ శిక్షణ పొందుతున్న విద్యార్థులతో పాటు ఉచిత కోచింగ్ తీసుకుంటున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థులు కూడా పోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి తుంగతుర్తికి గుర్తింపు తీసుకువచ్చిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు శిక్షణ అందిస్తున్న బొంకూరి అరుణను సైతం పలువురు ప్రశంసించారు.

# భూములపై ఇసుక మాఫియా కన్ను

- మట్టి తవ్వి కృత్రిమ ఇసుక తయారీ
- ఉదండాపూర్ జలాశయం కేంద్రంగా దందా?
- అధికారుల తీరుపై ఆరోపణలు



**ప్రజానావ, మహబూబ్‌నగర్:** వాగుల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మాఫియా ఇప్పుడు వాటి పరిసరాల్లోని భూములపై కన్నేసిందనే ఆరోప ణలు వినిపిస్తున్నాయి. భూముల నుంచి మట్టిని భారీ యంత్రాలతో తవ్వి, నీటితో కడిగి కృత్రిమ ఇసుకగా మార్చి విక్రయిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రాజాపూర్ మండలంలోని ఉదండాపూర్ జలాశయం పరిసరాలతో పాటు పలు వాగుల్లో ఈ దందా కొనసాగుతున్నప్పటికీ స్థానిక నేతల అండదండలు ఉండటంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అడపాదడపా తనిఖీలు, ఒకట్రెండు వాహనాల పట్టివేతతో అధికారులు చేతులు దులుపుకుంటున్నారని స్థానికు లు అంటున్నారు. రాజాపూర్, కుచ్చర్‌కల్, చెన్నవెల్లి, రాయపల్లి, దోండ్లపల్లి, తిర్మలాపూర్, కుత్నేపల్లి, నంది గామ, మల్లేపల్లి, అగ్రహారం, పొట్లపల్లి, ముదిరెడ్డిపల్లి, బీబీనగర్ శివార్లలోని దుందుభి వాగు పరిసరాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మట్టిని హిటాచీ, పొక్లెయిన్ యంత్రాలతో తవ్వి ట్రాక్టర్లలో తరలించి, ఇంజిన్లకు మోటార్లు బిగించి నీటిని కొట్టడం ద్వారా కృత్రిమ ఇసుక తయారు చేస్తున్నట్లు సమాచారం. మరికొం దరు టిప్పర్లలోనే మట్టిని కడిగి, వాగుల సమీపంలోని రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసి రాత్రింబవళ్లు పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా పోలేపల్లి పారిశ్రామికవాడ, జడ్చర్ల, హైదరాబాద్ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కొందరు అక్రమార్కులు ఉదండాపూర్ జలాశయం వద్దే మకాం వేసి టిప్పర్లలో మట్టిని తీసుకువచ్చి అక్కడే కడిగి కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జలాశయం సమీపంలోనే ఈ కార్యకలాపాలు సాగుతున్న ప్పటికీ పోలీసులు, రెవెన్యూ అధికారులు ఒకట్రెండు వాహనాలను పట్టుకుని నామమాత్రంగా జరిమానాలు విధించి వదిలేస్తున్నారని స్థానికు లు ఆరోపిస్తు న్నారు. అధిక లోడుతో ఇసుక టిప్పర్లు రాకపోకలు సాగిస్తుండటంతో బీటీ రోడ్లు ధ్వంసమవుతున్నాయని రాజాపూర్ సర్పంచ్ రామకృష్ణతో పాటు పాలకవర్గ సభ్యులు మండల ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని చెబుతున్నారు. అధికారులు స్పందించకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, కొన్ని సందర్భా ల్లో రెవెన్యూ, పోలీసు అధికారులు ఇసుక వాహనాల ను పట్టుకున్నప్పటికీ వాటిని విడిచిపెట్టాలని కొందరు రాజకీయ నాయకులు ఫోన్ల ద్వారా ఒత్తిడి చేస్తున్నా రనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పట్టుకున్న వాహ నాలను సైతం వదిలేస్తున్నారని స్థానికులు అంటున్నారు. రాత్రివేళ పెట్రోలింగ్ నిర్వహించే కొందరు పోలీసులు మామూళ్లు తీసుకుని టిప్పర్లను వదిలేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణా, మట్టి తవ్వకాలపై సమగ్ర విచారణ జరిపి అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

# సర్కారు దవాఖానాలో.. పర్యవేక్షణ కరువు

- ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలపై ప్రశ్నలు
- ఎక్కడ చూసినా ఆరోపణలు, అవకతవకలే
- ప్రైవేట్ వైపు మొగ్గుతున్న రోగులు



**ప్రజానావ, మెదక్:** ఒకచోట ఆసుపత్రిలో పనిచేసే పొరుగు సేవల ఉద్యోగి ఆత్మహత్య.. మరోచోట విధులు నిర్వహించే మహిళపై అత్యాచారం.. ఇంకో ఆసుపత్రిలో ఎలుకలు, పాముల సంచారం.. మరొకచోట ప్రభుత్వ వైద్యుల స్థానంలో ప్రైవేటు వైద్యులతో చికిత్స.. ఇవన్నీ మారుమూల ప్రాంతాల్లో జరుగుతున్న ఘటనలు కావు. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో తరచూ వెలుగుచూస్తున్న పరిణామాలివి. ఆసుపత్రులపై పర్యవేక్షణ కొరవడటంతో ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకప్పుడు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లేందుకు వెనుకంజ వేసే పరిస్థితి ఉండగా, మౌలిక వసతులు, వైద్య సేవలు మెరుగుపడటంతో క్రమంగా రోగుల తాకిడి పెరిగింది. అయితే ప్రస్తుతం పర్యవేక్షణ లోపాలు, సిబ్బంది వ్యవహారశైలిపై వస్తున్న ఆరోపణలు, పారిశుద్ధ్య సమస్యలు, వైద్యుల కొరత తదితర కారణాలతో పరిస్థితి మళ్లీ పాతస్థితికి చేరుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### సంగారెడ్డి జిల్లాలో పరిస్థితి

జిల్లాకేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఉద్యోగులు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు రోగులకు అందుతున్న సేవలు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయని విమర్శలు ఉన్నాయి. జహీరాబాద్ ప్రాంతీయ ఆసుపత్రిలో ఎలుకలు, పాములు సంచరిస్తుండటంతో రోగులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల నారాయణఖేడ్ సబ్‌కలెక్టర్ ఉమాహారతి తనిఖీ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలు, పారిశుద్ధ్య నిర్వహణ తీరుపై అసంతృప్తి వ్యక్తమైనట్లు సమాచారం. మాతా శిశు సంరక్షణ కేంద్రానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో భవనం పూర్తయినా ప్రారంభానికి నోచుకోకపోవడం మరో సమస్యగా మారింది. జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రైవేటు వైద్యులు సేవలందించినట్లు విచారణలో నిర్ధారణ అయినట్లు అధికారులు వెల్లడించారు. జహీరాబాద్ ఆసుపత్రిలోనూ ప్రభుత్వ వైద్యుడి స్థానంలో ప్రైవేటు వైద్యుడితో సేవలు అందించారనే ఆరోపణలు వచ్చాయి. మరోవైపు పటాన్‌చెరులో నూతనంగా నిర్మించిన సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభానికి నోచుకోక సుమారు ఆరు నెలలుగా నిరుపయోగంగా ఉందని విమర్శలు ఉన్నాయి. ఆసుపత్రిలో విధులు నిర్వహించే కొందరు వైద్యులు ప్రైవేటు పార్టీలకు హాజరవుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

### ప్రైవేట్ వైపు మొగ్గు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపడటంతో గతంలో రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే ప్రస్తుతం కొన్ని ఆసుపత్రుల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు, పర్యవేక్షణ లోపాల కారణంగా ప్రజలు మళ్లీ ప్రైవేటు ఆసుపత్రుల వైపు మొగ్గుచూపుతున్నారని స్థానికులు అంటున్నారు. పేదలకు అందుబాటులో ఉండాల్సిన ప్రభుత్వ వైద్య సేవలపై నమ్మకం కోల్పోయే పరిస్థితి ఏర్పడటం ఆందోళన కలిగించే అంశమని పేర్కొంటున్నారు.

### పర్యవేక్షణ ఎక్కడ?

మూడు జిల్లాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులపై ఉన్నతాధి కారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ మరింత పెరగాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి పీహెచ్‌సీల తనిఖీలకే పరిమితమవుతు న్నారని, జనరల్ ఆసుపత్రుల్లో రోగులకు అందుతు న్న సేవలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి. మెదక్ జిల్లా కలెక్టర్ ఆసుపత్రులను సందర్శిస్తున్నప్పటికీ పర్యవేక్ష ణను మరింత పెంచాలని ప్రజలు కోరుతున్నారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రుల తనిఖీలపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు ఉన్నాయి. జహీరా బాద్ ఆసుపత్రిలోని పరిస్థితులపై నివేదిక ఇవ్వాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించిన నేపథ్యంలో నారాయణఖేడ్ సబ్‌కలెక్టర్‌కు బాధ్యతలు అప్పగించడం వరకే పరిమితమైందనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది విధుల నిర్వహ ణ, పారిశుద్ధ్యం, మందుల లభ్యత, రోగులకు అందుతున్న సేవలు, భద్రత తదితర అంశాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి లోపాలను సరిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు. లేకుంటే పేదలకు భరోసాగా నిలవాల్సిన సర్కారు దవాఖానాలపై నమ్మకం మరింత దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# అసైన్డ్ భూములపై రియల్ వ్యాపారుల కన్ను

- పేదల అవసరాలను ఆసరాగా చేసుకుని చౌకగా కొనుగోలు యత్నాలు
- ఎకరాకు రూ.5 లక్షలు, 600 గజాల ప్లాట్లతో బేరాలు.. బెదిరింపుల ఆరోపణలు

**ప్రజానావ సంగారెడ్డి:** పేదల భూములపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడిందని కంది మండలంలోని అసైన్డ్ భూముల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని భూములను చౌకగా కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. కంది మండల పరిధిలోని భూములకు ప్రస్తుతం ఎకరాకు సుమారు రూ.3 కోట్ల వరకు ధర పలుకుతుండగా, అసైన్డ్ భూములకు సైతం రూ.2 కోట్ల వరకు విలువ ఉన్నట్లు చెబుతున్నారు. కంది గ్రామంలోని సర్వే నంబర్ 656లో మొత్తం 77.23 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. నాలుగేళ్ల క్రితం ఇందులో 48.26 ఎకరాలను 60 మంది రైతులు ల్యాండ్ పూలింగ్ కింద విక్రయాలకు అంగీకరించారు. అప్పట్లో ఎకరానికి 600 గజాల చొప్పున ప్లాట్లు ఇస్తామని చెప్పడంతో పాటు ధ్రువీకరణ పత్రాలు కూడా పంపిణీ చేసినట్లు రైతులు చెబుతున్నారు. అయితే నాలుగేళ్లు గడిచినా ఇప్పటివరకు హద్దులు చూపించకపోవడంతో ఆ సమస్య పరిష్కారం కాకుండానే ఉంది. తాజాగా మిగిలిన 28.97 ఎకరాల అసైన్డ్ భూములపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల దృష్టి పడిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఎకరాకు రూ.5 లక్షల నగదు, అదనంగా 600 గజాల ప్లాటు ఇస్తామంటూ కొందరు బేరాలు సాగిస్తు న్నట్లు సమాచారం. ఇప్పటికే సుమారు పది మంది రైతుల నుంచి బాండ్ల పేరుతో పత్రాలు తీసుకున్నట్లు స్థానికంగా ప్రచా రం జరుగుతోంది. ఇదిలా ఉండగా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రైవేట్ వ్యక్తులకు భూములను విక్రయించేందుకు ప్రయత్ని స్తున్నాడని అసైన్డ్ భూముల రైతులు ఆరోపిస్తున్నారు. ఎకరాకు కేవలం రూ.5 లక్షలకే భూమి ఇవ్వాలని తమపై ఒత్తిడి, బెదిరింపులు చేస్తున్నారని వారు వాపోతున్నారు. పంటలు సాగు చేస్తున్న భూములను దున్నేసి ప్లాట్లుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమ భూములను కాపాడడంతో పాటు గతంలో ల్యాండ్ పూలింగ్ పేరుతో ఇచ్చిన హామీలను నెరవేర్చి, అక్రమ భూ లావాదేవీలపై విచారణ జరిపి న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులను అసైన్డ్ భూముల రైతులు కోరుతున్నారు.





## మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల తీరు అవమానకరం

- అసెంబ్లీ ఘటనను 'దుశ్శాసన పర్వం'గా భావిస్తున్నాం
- వైరా మాజీ ఎమ్మెల్యే బాణోత్ చంద్రావతి

**ప్రజానావ ఖమ్మం:** అసెంబ్లీ సాక్షిగా మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర అవమానకరమని వైరా మాజీ ఎమ్మెల్యే బాణోత్ చంద్రావతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనను 'దుశ్శాసన పర్వం'గా భావిస్తున్నామని పేర్కొంటూ వైరా పట్టణంలోని రింగ్ రోడ్ సెంటర్‌లో తారు రోడ్డుపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చంద్రావతి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రజా సమస్యలను ప్రస్తావిస్తున్న ప్రతిపక్ష మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్రంగా ఖండించదగినదన్నారు. ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడం తప్పా? ప్రజల పక్షాన మాట్లాడటమే వారు చేసిన పాపమా? అని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేలనే గౌరవం లేకుండా జుట్టు పట్టుకుని లాగడం, తోసేయడం దారుణమని, ఈ క్రమంలో వారు అసెంబ్లీ గ్రిల్స్‌పై పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన ఇద్దరు మహిళా ఎమ్మెల్యేలకు జరిగిన అవమానం మాత్రమే కాదని, రాష్ట్రంలోని మహిళలందరికీ జరిగిన అవమానంగా భావిస్తున్నామని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి ఉన్న హక్కులను కాలరాస్తూ ప్రశ్నించే గొంతులను అణచివేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలు, ప్రజా సమస్యలు వెలుగులోకి రాకుండా ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రజల తరఫున ప్రశ్నించే వారిని అడ్డుకోవడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని పేర్కొన్నారు. సమయం వచ్చినప్పుడు ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కట్ట కృష్ణార్జునరావు, బాణాల వెంకటేశ్వరరావు, షేక్ లాల్ అహ్మద్, కామినేని శ్రీనివాసరావు, చిలక చిన్నకోటయ్య, తిరుపతి శ్రీను, అప్పం సురేష్, ధామ లలిత్ చౌదరి, బాణోత్ సక్కుబాయి, అయినాల కనకరత్నం, గుజ్జర్లపూడి దేవరాజ్, వేముల శివకృష్ణ, బట్ట భద్రయ్య, మన్యం సత్యానందం, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- హైపవర్ కమిటీ వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలి
- సెప్టెంబర్ 10న నిరాహార దీక్షను విజయవంతం చేయాలి




**ప్రజానావ, గోదావరిఖని:** సింగరేణి సంస్థ వ్యాప్తంగా కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు హైపవర్ కమిటీ వేతనాలు, ఉద్యోగ భద్రత సాధించడమే లక్ష్యంగా తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ శ్రీరాంపూర్ ఏరియాలో విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గనిలోని జీవీఆర్ కంపెనీ వాల్వో డ్రైవర్లు, ఓసీపీ మైన్ బెల్ట్ క్లీనింగ్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది, నర్సరీలు, పార్కుల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. సెప్టెంబర్ 10న గోదావరిఖని RG–1 జీఎం కార్యాలయం ఎదుట నిర్వహించనున్న భారీ నిరాహార దీక్షను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సింగరేణిలో పర్మినెంట్ కార్మికులతో సమానంగా ప్రాణాలను పణంగా పెట్టి రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు నేటికీ న్యాయమైన వేతనాలు అందడం లేదని సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పర్మినెంట్ కార్మికుల మాదిరిగానే కాంట్రాక్ట్ కార్మికులకు కూడా యూనియన్ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. నర్సరీలు, పార్కుల్లో పనిచేస్తున్న కార్మికులకు సంబంధించి ఇప్పటివరకు టెండర్లు పిలవకపోవడంతో వారు ఉపాధి కోల్పోయి కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. వెంటనే టెండర్లు పిలిచి వారికి ఉపాధి కల్పించాలని కోరారు. సివిల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న మేసన్లు, కార్పెంటర్లు, ప్లంబర్లు, హెల్పర్లు, ఓసీపీ విభాగాల్లోని వాల్వో డ్రైవర్లు, మైన్ బెల్ట్ క్లీనింగ్ కార్మికులు, బ్లాస్టింగ్ సిబ్బంది, వైద్య, ఆసుపత్రి విభాగాల్లోని స్టాఫ్ నర్సులు, వార్డ్ బాయ్‌లు, ఆయాలు, శానిటేషన్ కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ సింగరేణి యాజమాన్యం మాత్రం కాంట్రాక్టర్ల ద్వారా అరకొర వేతనాలు చెల్లిస్తూ కార్మికులకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. 'సమాన పనికి సమాన వేతనం' అనే సుప్రీంకోర్టు తీర్పులు, కార్మిక చట్టాలు, హైపవర్ కమిటీ వేతన జీవోలను అమలు చేయడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. తక్కువ మొత్తాలకు కోట్ చేసి కాంట్రాక్టులు దక్కించుకునే కాంట్రాక్టర్ల కారణంగా కార్మికుల వేతనాలు పెరగకపోవడంతో పాటు కనీస సౌకర్యాలు కూడా అందడం లేదన్నారు. ఈ పర్యటనలో సంఘం నాయకులు ప్రస్తావించిన సమస్యలకు కార్మికుల నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. తమకు న్యాయం జరిగే వరకు, పర్మినెంట్ కార్మికుల మాదిరిగా ఓటు హక్కు, హైపవర్ కమిటీ వేతనాలు, ఉద్యోగ భద్రత సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేశారు. కార్మికులందరినీ ఒకతాటిపైకి తీసుకువచ్చి సమస్యలపై చైతన్యం కల్పిస్తున్న తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం పోరాటానికి కార్మిక లోకం మద్దతు ప్రకటించింది. సెప్టెంబర్ 10న గోదావరిఖని ఆర్‌జీ–1 జీఎం కార్యాలయం ఎదుట నిర్వహించనున్న నిరాహార దీక్షకు కాంట్రాక్ట్ కార్మికులందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం పిలుపునిచ్చింది.



## కాంగ్రెస్ హామీల అమలుపై బీఆర్ఎస్ నిరసన

**ప్రజానావ, వేములవాడ:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వేములవాడ పట్టణ బిఆర్ఎస్ నాయకులు తెలంగాణ చౌక్‌లో నిరసన చేపట్టారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 22ఏ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి అర్హులైన రైతుల భూములను జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, ఏనుగు తిరుపతిరెడ్డి, రామతీర్థపు రాజు, వెంగళ శ్రీకాంత్‌గౌడ్, వాసాల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు వస్తుంది

భూమి పూజలో డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్



**ప్రజానావ, సిరిసిల్ల :** కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తుందని, వారి గౌరవాన్ని కాపాడుతుందని డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం రాజీవ్ నగర్ చెందిన ఆడెపు ఆనంద్, చంద్రంపేటకు చెందిన సనుగుల నరసవ్వ గారల ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు తో కలిసి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్‌ల చేతుల మీదుగా నిర్వహించారు. అనంతరం వీరు మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో పట్టణ కేంద్రం, గ్రామాలలో ఇండ్లు లేని వారు ఉండకూడదని ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ విడతలో రెండు వేల వరకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని ఈనెల చివరి వారంలో వారికి ఇందిరమ్మ పట్టాలు వస్తాయని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక గ్రామానికి గాని పట్టణా కేంద్రంలో గాని ఒక్క పేద ప్రజలకు ఇల్లు ఇచ్చిన దాఖలాలు లేవనీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజల కళ్ళల్లో ఆనందాన్ని చూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలి ఫ్లోర్ లీడర్ ఆడెపు చంద్రకళ, పట్టణ కాంగ్రెస్ కార్యదర్శి వంతడుపుల రాము, కోడం నాగభూషణం, వార్డు అధ్యక్షులు కోలకాని రాజేశం, ఆకేని సతీష్, ఆడెపు ప్రసాద్, వంగరి అనిల్, నాయకులు ఎండి కలీం, నూనె శ్రీనివాస్, పల్లపు శ్రీనివాస్, అబ్బగోని లచ్చయ్య, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నివారణకు దోమల మందు పిచికారీ

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



**ప్రజానావ, పెద్దపల్లి:** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 11వ డివిజన్‌లో ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణ మందును పిచికారీ చేశారు. మురుగునీరు నిల్వ ఉండే ప్రాంతాలు, మురుగునీటి కాలువలతో పాటు ఎంపీపీఎస్ విట్టల్‌నగర్ పరిసర ప్రాంతాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేసి దోమల వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ 'ఫ్రైడే–ఫ్రైడే' కార్యక్రమాన్ని పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీఎస్ విట్టల్‌నగర్ ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, సరళకుమారి, మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్ ఆడెపు శ్రీనివాస్, నాయకులు విజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో పోటెత్తిన భక్తజనం



**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం చివరి సోమవారం సందర్భంగా భక్తుల రద్దీ భారీగా పెరిగింది. వేకువజాము నుంచే భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు 73,891 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, శివ కళ్యాణం తదితర సేవలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా దేవస్థాన అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## సిరిసిల్లకు తెలంగాణ పబ్లిక్ స్కూల్

రూ.10.63 కోట్ల పరిపాలనా అనుమతులు

**ప్రజానావ, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరైంది. పాఠశాల నిర్మాణానికి రూ.10.63 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. 2026–27 బడ్జెట్‌లో టీజీపీఎస్‌ల అభివృద్ధికి రాష్ట్ర వాటా కింద రూ.209.969 కోట్లు కేటాయించడంతో పాటు, ఏఐబీ రుణం ద్వారా మరో రూ.489.926 కోట్లను వినియోగించుకునేందుకు అనుమతి ఇవ్వడం అభినందనీయమన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలి

ఎంపీడీవో రాజేందర్

**ప్రజానావ, గంభీరావుపేట:** ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో రాజేందర్ పిలుపునిచ్చారు. సోమవారం గంభీరావుపేట మండల కేంద్రంలో పల్లె కవిత శ్రీనివాసులకు మంజూరైన ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సోమవారం భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వము ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను చేపడుతున్నట్లు తెలిపారు. మంజూరైన లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా త్వరిగతిన నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు. అదేవిధంగా మండల కేంద్రంలో మంజూరైన పలు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు కాంగ్రెస్ నాయకులు భూమి పూజ నిర్వహించారు.

## నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ పోరుబాట

- హామీలు ఎక్కడ? ఉద్యోగాలు ఎక్కడ?
- యువత భవిష్యత్తు ఎక్కడ?
- బాల్క సుమన్, వ్యాల్ల హరీష్‌రెడ్డి




**ప్రజానావ పెద్దపల్లి:** ఎన్నికల సమయంలో యువత, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో 'కాంగ్రెస్ వెయ్యి రోజుల దగా' పేరుతో పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన ర్యాలీలో మాజీ ఎంపీ, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా వ్యాల్ల హరీష్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఉద్యోగాలు, ఉద్యోగ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగులకు స్కూటీలు వంటి అనేక హామీలను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిం చారు. ''హామీలు ఎక్కడ? ఉద్యోగాలు ఎక్కడ? యువత భవిష్యత్తు ఎక్కడ?'' అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి వెంటనే అందించడంతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఖాళీ ఉద్యోగాల వివరాలను వెల్లడించి స్పష్టమైన ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించాలని, నోటిఫికేషన్లు, పరీక్షలు, ఫలితాలు, నియామక ప్రక్రియలను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయాలని కోరారు. జీవో 97తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే ముందు విద్యార్థులు, విద్యా నిపుణులతో ప్రభుత్వం చర్చించాలని సూచించారు. ''హామీ అంటే మాట.. మాట అంటే బాధ్యత.. బాధ్యత అంటే అమలు'' అని పేర్కొన్న హరీష్ రెడ్డి, యువత, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ''మన చదువు కోసం పోరాడుదాం.. మన ఉద్యోగాల కోసం పోరాడుదాం.. మన హక్కుల కోసం గళమెత్తుదాం'' అంటూ యువతకు పిలుపునిచ్చారు. యువత మేల్కొంటే మార్పు తప్పదని, విద్యార్థులు–నిరుద్యోగుల ఐక్యతే తమ బలమని నాయకులు పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కౌశిక్ హరి, మేకల సమ్మయ్య యాదవ్, బక్కి కిషన్, రమణ రెడ్డి, పోలాడి శ్రీనివాస్ రావు, రంగు దుర్గాప్రసాద్, చొప్పరి శ్రీనివాస్, రాజ్‌కుమార్, విద్యార్థి విభాగ నాయకుడు సార్ల ఉదయ్, తోట సాయి రఘు, నిజాముద్దీన్, రౌతు గణేష్, యువజన విభాగ నాయకులు బూరుగు వంశీకృష్ణ, మేడం సతీష్, మామిడాల రాము, కొండా సురేష్, యుగంధర్, యువరాజ్ నేత, కంకల దేవేందర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శివనామస్మరణతో మార్మోగిన కొడవటూరు

- భక్తిశ్రద్ధలతో అగ్నిగుండాలు దాటిన భక్తులు
- వైభవంగా సిద్ధేశ్వరస్వామి ఉత్సవాలు



**ప్రజానావ జనగామ:** తెలంగాణలోని ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటైన బచ్చన్నపేట మండలం కొడవటూరులోని శ్రీ సిద్ధేశ్వరస్వామి దేవాలయం శివనామస్మరణతో మార్మోగింది. సోమవారం నిర్వహించిన అగ్నిగుండాల ఉత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా ముగిశాయి. తెల్లవారుజాము నుంచే జనగామ జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భగభగ మండుతున్న అగ్నిగుండాలపై నడుస్తూ భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. అగ్నిగుండాలు దాటే సమయంలో భక్తులు ''హర హర మహాదేవ.. శంభో శంకర.. సిద్ధేశ్వర స్వామికి జై'' అంటూ చేసిన శివనామస్మరణలు, జయజయధ్వానాలతో ఆలయ పరిసరాలు దద్దరిల్లాయి. సిద్ధేశ్వరస్వామి అనుగ్రహంతో తమ కోరికలు నెరవేరాలని, కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ భక్తులు అగ్నిగుండాల్లో పాల్గొన్నారు. స్వామివారిపై ఉన్న అపారమైన విశ్వాసంతో అగ్నిగుండాలను దాటి తమ భక్తిని చాటుకున్నారు. భక్తుల రాకతో కొడవటూరు గ్రామం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. భక్తి, విశ్వాసం, సంప్రదాయాల సమ్మేళనంగా కొనసాగుతున్న ఈ అగ్నిగుండాల ఉత్సవానికి భక్తుల్లో ప్రత్యేక నమ్మకం ఉంది. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించగా, ఉత్సవాన్ని వీక్షించేందుకు వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం నిర్వాహకులు ముందస్తుగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రాకపోకలు, దర్శనం, అగ్నిగుండాల కార్యక్రమం తదితర అంశాలను దేవస్థానం ఈవో చిందం వంశీ, చైర్మన్ ఇదులకంటి వెంకట్‌రెడ్డి పర్యవేక్షించారు. దేవస్థానం సిబ్బందికి పలు సూచనలు చేస్తూ భక్తులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు చేపట్టారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐ దేవేందర్, ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు నిర్వహించి అగ్నిగుండాల ప్రాంతంలో భక్తుల భద్రతకు చర్యలు చేపట్టారు. భక్తులు క్రమపద్ధతిలో అగ్నిగుండాలను దాటేలా పర్యవేక్షిస్తూ ఆలయ పరిసరాల్లో రద్దీని నియంత్రించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచి ఉత్సవం ప్రశాంతంగా జరిగేలా సమన్వయంతో విధులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి ఓం నమశివాయ, సర్పంచ్ నీల కవిత మురళి, కొడవటూరు దేవస్థానం డైరెక్టర్లు, ఆలయ సిబ్బంది, పోలీసు అధికారులు, గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. భక్తి, విశ్వాసం, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన కొడవటూరు శ్రీ సిద్ధేశ్వరస్వామి అగ్నిగుండాల ఉత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించాయి.

## జెండా గద్దె నిర్మాణంపై ఘర్షణ

- బంజారులు, గ్రామస్తుల మధ్య తోపులాట
- పలువురికి గాయాలు.. పరిస్థితిని అదుపులోకి తెచ్చిన పోలీసులు

**ప్రజానావ నిజామాబాద్:** సిరికొండ మండలం కొండాపూర్ గ్రామంలో జెండా గద్దె నిర్మాణం విషయంలో బంజారులు, గ్రామస్తుల మధ్య సోమవారం ఘర్షణ చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలోని బంజారులు జెండా గద్దె నిర్మాణ పనులు ప్రారంభించగా, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టవద్దని గ్రామ కార్యదర్శి సూచించడంతో పనులను నిలిపివేశారు. అనంతరం సోమవారం బంజారులు అక్కడ పూజలు నిర్వహించగా గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకోవడంతో కొందరు గాయపడ్డారు. పరిస్థితి అదుపు తప్పే అవకాశం ఉండటంతో పోలీసులు లాఠీచార్జి చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. అనంతరం రెవెన్యూ అధికారులు, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడి పరిస్థితిని శాంతింపజేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు, పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు.



## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత కంటి అద్దాలు

- ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో వైద్య శిబిరం
- విద్యార్థులకు నేత్ర పరీక్షలు

**ప్రజానావ, రాజన్న సిరిసిల్ల:** వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారుల బృందం 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రక్త, నేత్ర పరీక్షలు నిర్వహించడంతో పాటు వారి ఎత్తు, బరువును కొలిచి ఆరోగ్య వివరాలను నమోదు చేసుకున్నారు. పరీక్షల్లో దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించిన పలువురు విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. చిన్నతనంలోనే కంటి సమస్యలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రభాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజారత్నం, ఉపాధ్యాయులు మల్లేశం, కోటేశ్వర్, సలాం, హమీద్, చంద్రమౌళి, జ్యోతి, శిరోమణి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## వేయిస్తంభాల రుద్రేశ్వరస్వామికి విశేష అభిషేకం

- శ్రావణ చివరి సోమవారం భక్తులతో కిటకిటలాడిన ఆలయం
- 150 మందితో సామూహిక రుద్రాభిషేకాలు



**ప్రజానావ, హనుమకొండ:** శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి 51 లీటర్ల పాలతో, 50 లీటర్ల పెరుగుతో, 31 కిలోల పుట్టతేనెతో, 11 కిలోల ఆవు నెయ్యితో, 41 కిలోల చక్కెరతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. శివప్రీతికరమైన సోమవారం కావడంతో ఆలయం భక్తుల కోలాహలంతో కిటకిటలాడింది. సుమారు 150 మంది భక్తులు సామూహిక రుద్రాభిషేకాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వద్దిరాజు వెంకటేశ్వర్లు–ఉమారాణి దంపతులతో పాటు వ్యాపారవేత్తలు, న్యాయవాదులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ ఈవో డి.అనిల్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించగా, వైదిక కార్యక్రమాలను ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ నుంచి ఉత్తిష్ఠ గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఏపీ అదనపు కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, ఉమ్మడి రాష్ట్ర దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ జ్ఞాన్‌దేవ్‌రెడ్డి, రాజేంద్రం, మేడారం ఈవో వీరస్వామి, భద్రీనాథ్ తదితర అధికారులు పాల్గొని స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు.

# న్యూ మెక్సికో పేరును 'న్యూ అమెరికా'గా మార్చాలన్న ట్రంప్

- 'మరింత ప్రతిష్టాత్మకంగా ఉంటుంది'
- ప్రతిపాదనను తీవ్రంగా తిరస్కరించిన గవర్నర్ మిషెల్ లుహాన్ గ్రిషమ్



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో పేరు మార్పు ప్రతిపాదనతో తెరపైకి వచ్చారు. న్యూ మెక్సికో రాష్ట్రం పేరును 'న్యూ అమెరికా'గా మార్చే ఆలోచనను ఆయన ఆదివారం సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు. న్యూ మెక్సికో పేరును మార్చాలని పలువురు సూచించారని, 'న్యూ అమెరికా' అనే పేరు రాష్ట్ర ప్రజలకు మరింత ప్రతిష్టా త్మకంగా ఉంటుందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ఆలో చన తనకు ఎంతో నచ్చిందంటూ ఆయన ఉత్సాహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా 'న్యూ మెక్సికో' పేరు లోని 'మెక్సికో'ను తొలగించి 'అమెరికా'గా మార్చిన మ్యాప్‌లను కూడా సోషల్ మీడియాలో పంచుకు న్నారు. అయితే ట్రంప్ ప్రతిపాదనకు న్యూ మెక్సికో గవర్నర్ మిషెల్ లుహాన్ గ్రిషమ్ తీవ్రంగా వ్యతిరేకిం చారు. రాష్ట్రం పేరును మార్చే అంశంపై ఎలాంటి చర్చే లేదని ఆమె స్పష్టం చేశారు. న్యూ మెక్సికో అనే పేరు అమెరికా ఏర్పడక ముందే తమ రాష్ట్రానికి ఉందని, దానిని మార్చే ప్రశ్నే లేదని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. రాష్ట్రం పేరును మార్చే అధికారం అమెరికా అధ్యక్షుడికి లేదని పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. పేరు మార్పు ప్రక్రియ రాష్ట్ర పరిధిలోనే ఉంటుంది. కాగా కెనడాతో వాణిజ్య చర్చలు ఉద్రిక్తంగా సాగుతున్న సమయంలో గత నెలలో ఒంటారియో సరస్సు పేరును 'లేక్ అమెరికా' గా మార్చుతూ ట్రంప్ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అంతకుముందు గల్ఫ్ ఆఫ్ మెక్సికోను 'గల్ఫ్ ఆఫ్ అమెరికా'గా పిలవాలని కూడా ఆయన ఆదేశించారు. ఈ వరుస పేరు మార్పుల నేపథ్యంలో తాజాగా న్యూ మెక్సికోను 'న్యూ అమెరికా'గా మార్చా లన్న ట్రంప్ ప్రతిపాదన అమెరికాలో రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

# విమానాలతో పోటీపడుతున్న మాగ్లెవ్ రైళ్లు

- చైనా, జపాన్‌లలో అత్యాధునిక రైలు సాంకేతికత
- గంటకు 600 కి.మీ. వేగం.. ప్రయాణ సమయం భారీగా తగ్గే అవకాశం



**చైనా:** వేగంలో విమానాలతో పోటీపడేలా చైనా, జపాన్‌లు అత్యాధునిక రైళ్లను అభివృద్ధి చేస్తున్నాయి. తూర్పు ఆసియాలో గంటకు 370 మైళ్లు (సుమారు 600 కి.మీ.) వేగంతో దూసుకెళ్లే మాగ్లెవ్ రైళ్లు వాణిజ్య విమాన ప్రయాణానికి ప్రత్యామ్నాయంగా నిలిచే దిశగా అడుగులు వేస్తున్నాయి. ప్రస్తుతం వాణిజ్య విమానాలు గంటకు సుమారు 550 మైళ్లు (885 కి.మీ.) వేగంతో ప్రయాణిస్తుండగా, మాగ్లెవ్ రైళ్లు గంటకు దాదాపు 370 మైళ్ల వేగంతో దూసుకెళ్తూ ప్రయాణికులకు గాల్లో ఎగురుతున్న అనుభూతిని కలిగిస్తాయి. సాధారణ హైస్పీడ్ రైళ్లు గంటకు 217 మైళ్లు (350 కి.మీ.) వేగంతో ప్రయాణిస్తుండటంతో మాగ్లెవ్ సాంకేతికత వాటికి పూర్తిగా భిన్నంగా నిలుస్తోంది. సాంప్రదాయ బుల్లెట్ రైళ్లు, విమాన యాన రంగం మధ్య వేగ వ్యత్యాసాన్ని తగ్గించే లక్ష్యం తో చైనా ప్రభుత్వ మద్దతు ఉన్న రైలు తయారీ సంస్థ సీఆర్ఆర్‌సీ గంటకు 370 మైళ్ల వేగంతో ప్రయాణించే మాగ్లెవ్ రైలు ప్రోటోటైప్‌ను ప్రదర్శించింది. విద్యుదయస్కాంత సస్పెన్షన్ సాంకేతికతపై పనిచేసే ఈ రైలు యాంత్రిక ఘర్షణ లేకుండా గైడ్ ట్రాక్‌కు కొన్ని మిల్లీమీటర్ల ఎత్తులో తేలుతూ అత్యంత వేగంగా ప్రయాణిస్తుంది. గరిష్ఠ వేగంతో ఇరుకైన పర్వత ప్రాంతాల్లోని సొరంగాల్లోకి ప్రవేశించే సమయంలో ఏర్పడే 'టన్నెల్ బూమ్' గాలి ఒత్తిడిని నియంత్రించడం వంటి క్లిష్టమైన ఏరోడైనమిక్ సవాళ్లను అధిగమిం చేందుకు చైనా ఇంజినీర్లు పోరస్, షాక్ అబ్జార్బింగ్ టన్నెల్ బఫర్ వ్యవస్థలను అభివృద్ధి చేశారు. రద్దీగా ఉండే బీజింగ్–షాంఘై కారిడార్‌లో ఈ 370 మైళ్ల వేగం కలిగిన మాగ్లెవ్ రైలును అందుబాటులోకి తీసుకొస్తే ప్రస్తుతం సుమారు నాలుగు గంటలు పడుతున్న ప్రయాణ సమయం 2.5 గంటలకు తగ్గే అవకాశం ఉంది. దీంతో కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గించడంతోపాటు డోర్–టు–డోర్ ప్ర యాణ సమయం విషయంలో విమానాలకు దీటుగా రైలు ప్రయాణం మారే అవకాశం కనిపిస్తోంది.

### పోటీలో జపాన్ రైళ్లు

ఆధునిక బుల్లెట్ రైళ్లకు 'షింక్యాన్సెన్'తో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న జపాన్ కూడా మాగ్లెవ్ సాంకేతికతలో చైనాకు గట్టి పోటీ ఇస్తోంది. జపాన్ చేపట్టిన చువో షింక్యాన్సెన్ ప్రాజెక్టులో భాగంగా సూపర్ కండక్టింగ్ మాగ్నెటిక్ లెవిటేషన్ సాంకేతికతపై రూపొందించిన టెస్ట్ రైళ్లు ప్రయోగా త్మక ట్రాక్‌పై గంటకు 375 మైళ్లు (603 కి.మీ.) వేగాన్ని అందుకుని రికార్డు సృష్టించాయి. టోక్యో, నాగోయా, ఒసాకా నగరాలను అనుసంధానించేలా ఈ వ్యవస్థను రూపొందిస్తున్నారు. అత్యల్ప ఉష్ణోగ్రత లకు చల్లబరిచిన శక్తివంతమైన నియోబియం–టైటా నియం అయస్కాంతాలను ఉపయోగించడం ద్వారా రైలు ట్రాక్‌కు సుమారు 10 సెంటీమీటర్ల ఎత్తులో తేలుతూ ప్రయాణించేలా సాంకేతికతను అభివృద్ధి చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే టోక్యో నుంచి నాగోయా ప్రయాణ సమయం సుమారు 40 నిమిషాలకు తగ్గే అవకాశం ఉండగా, టోక్యో–ఒసాకా మధ్య ప్రయాణ సమయం కూడా భారీగా తగ్గనుంది. మొత్తంగా చైనా, జపాన్‌లలో అభివృద్ధి చెందుతున్న మాగ్లెవ్ సాంకేతికత భవిష్యత్తు లో రైలు ప్రయాణాన్ని విమాన ప్రయాణానికి అత్యంత సమీప ప్రత్యామ్నాయ ంగా మార్చే అవకాశాలను చూపిస్తోంది.

# మలేషియా విమానం అత్యవసర ల్యాండింగ్

- 186 మంది ప్రయాణికులు సురక్షితం

**చెన్నై:** మలేషియా ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం సోమవారం చెన్నై విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. కౌలాలంపూర్ నుంచి చెన్నైకి 186 మంది ప్రయాణికులతో బయలుదేరిన ఎంహెచ్156 విమానం గాల్లో ఉండగానే రెండో ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలె త్తింది. దీంతో అప్రమత్తమైన పైలట్లు వెంటనే చెన్నై ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అధికారులకు సమాచారం అందించి, అత్యవసర ల్యాండింగ్‌కు అనుమతి కోరా రు. అధికారులు అనుమతి ఇవ్వడంతో విమానాన్ని సురక్షితంగా చెన్నై విమానాశ్రయంలో దించారు. ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన విమానా శ్రయ అధికారులు ఎలాంటి అవాంఛనీయ ఘటన చోటుచేసుకోకుండా ఎమర్జెన్సీ ఏర్పాట్లు చేశారు. అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు, సీఐఎస్ ఎఫ్ సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. అయితే విమా నం ఎలాంటి ప్రమాదానికి గురికాకుండా సురక్షి ంగా ల్యాండ్ కావడంతో ప్రయాణికులతోపాటు విమానాశ్రయ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. విమానంలో ఉన్న 186 మంది ప్రయాణికులు సురక్షితంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. సాంకేతిక సమస్యకు కారణాలు, విమానాన్ని తదుపరి ప్రయాణానికి ఎప్పుడు అనుమతిస్తారన్న అంశాలపై అధికారులు పరిశీలన చేపట్టారు.

# హర్మూజ్ సెగ.. చమురు ధరలకు రెక్కలు

- అమెరికా-ఇరాన్ నౌకలపై పరస్పర దాడులు
- 20 శాతం ప్రపంచ చమురు సరఫరాకు కీలక మార్గంలో రాకపోకలు భారీగా తగ్గింపు



**పశ్చిమాసియా:** పశ్చిమాసియాలో అమెరికా–ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. హర్మూజ్ జలసంధి సమీపంలో ఇరుదేశాల నౌకలపై పరస్పర దాడులు జరగడంతో అంతర్జాతీయ మార్కెట్ల లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి ద్వారా సాధారణంగా ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు 20 శాతం రవాణా అవుతుండగా.. ప్రస్తుతం ఈ మార్గంలో నౌకల రాకపో కలు భారీగా తగ్గిపోవడం సరఫరా అంతరాయాలపై ఆందోళనలను పెంచుతోంది. ఇరాన్ ఆయిల్ ట్యాంకర్లపై దాడులు చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించగా.. దీనికి ప్రతిగా ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నేవీ కూడా అమెరికా నౌకలతోపాటు అనధికారిక మార్గాల్లో ప్రయాణిస్తున్న ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించింది. ఈ పరిణామాలను విశ్లేషకులు తీవ్రమైన ఘర్షణగా అభివర్ణిస్తున్నారు. హర్మూజ్ జలసంధిలో గతంలో రోజుకు 100కు పైగా నౌకలు రాకపోకలు సాగించగా.. ప్రస్తుతం ఆ సంఖ్య కేవలం 10కు పడిపోయినట్లు సమాచారం. అంతేకాకుండా త్వరలో ఈ ప్రాంతంలో కొత్తగా 'రిస్ట్రిక్టెడ్ జోన్' ప్రకటించేందుకు ఇరాన్ సిద్ధమవుతున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. దీంతో అంతర్జాతీయంగా చమురు సరఫరా మరింత దెబ్బతినే ప్రమాదం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 0.54 శాతం పెరిగి 96.80 డాలర్లకు చేరుకుంది. అమెరికా బెంచ్‌మార్క్ డబ్ల్యూటీఐ క్రూడ్ ధర కూడా 0.72 శాతం పెరిగి 92.14 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. గత వారంలోనే చమురు ధరలు 8 నుంచి 10 శాతం వరకు పెరగడం గమనార్హం. మరోవైపు సెప్టెంబర్ 6న సమావేశమైన ఒపెక్ ప్లస్ దేశాలు అక్టోబర్ నెల ఉత్పత్తి విధానంలో ఎలాంటి మార్పులు చేయకూడదని నిర్ణయించాయి. హర్మూజ్ జలసంధిలో సరఫరా అంతరాయాలు కొనసాగితే ముడి చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొన్ని సంస్థలు 2026 చివరి వరకు చమురు ఎగుమతులు పరిమితంగానే కొనసాగే అవకాశముం దని, సరఫరా వ్యవస్థ పూర్తిస్థాయిలో పునరుద్ధరిం చుకోవడానికి 2027 వరకు సమయం పట్టవచ్చని అంచనా వేశాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరగడంతోపాటు ఆర్థికవృ ద్ధిపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రానున్న రోజుల్లో అమెరికా–ఇరాన్ మధ్య దాడులు మరింత తీవ్రతరం అవుతాయా.. లేక దౌత్యపరమైన చర్చల ద్వారా ఉద్రిక్తతలు చల్లబడతాయా అన్నదానిపైనే అంతర్జాతీయ చమురు మార్కెట్ల తదుపరి గమనం ఆధారపడి ఉంది.

# ఏకే–203 రైఫిళ్లకు అదానీ సంస్థ మందుగుండు సరఫరా

- ఇండో–రష్యన్ రైఫిల్స్‌తో ఒప్పందం
- ఐదేళ్ల పాటు 7.62 ఎంఎం అమ్యునిషన్ సరఫరా



**న్యూఢిల్లీ:** బిలియనీర్ గౌతమ్ అదానీకి చెందిన అదానీ డిఫెన్స్ సంస్థ కీలక రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇండో–రష్యన్ రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఆర్ఆర్‌పీఎల్)తో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఏకే–203 అసాల్ట్ రైఫిళ్లకు అవసరమైన 7.62 ఎంఎం స్మాల్ క్యాలిబర్ మందుగుండు సామగ్రిని అదానీ డిఫెన్స్ సరఫరా చేయనుంది. ఉత్తరప్రదేశ్‌లోని కోర్వాలో ఉన్న అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ కేంద్రంలో రష్యా డిజైన్ చేసిన ఏకే–203 రైఫిళ్లను భారత భద్రతా దళాల అవసరాల కోసం తయారు చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా కుదిరిన ఒప్పందం ప్రకారం ఐదేళ్ల పాటు ఐఆర్ఆర్‌పీఎల్‌కు మందుగుండు సామగ్రిని సరఫరా చేయనుంది. ఈ అమ్యునిషన్‌ను కాన్పూర్‌లోని అదానీ డిఫెన్స్ తయారీ కేంద్రంలో ఉత్పత్తి చేయనున్నట్లు సంస్థ వెల్లడించింది. అయితే మొత్తం ఎన్ని రౌండ్ల మందుగుండును సరఫరా చేయాలన్న వివరాలు ఒప్పందంలో ఇంకా వెల్లడించలేదు. భారత్, రష్యా ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందం లో భాగంగా 2019లో ఐఆర్ఆర్‌పీఎల్ ఏర్పాటైంది. ఇందులో భారత్ తరఫున అడ్వాన్స్‌డ్ వెపన్స్ అండ్ ఎక్విప్‌మెంట్ ఇండియా లిమిటెడ్, మ్యూనిషన్స్ ఇండియా లిమిటెడ్ సంస్థలు వాటాదారులుగా ఉండగా.. రష్యా తరఫున కలష్నికోవ్, రోసోబోరో నెక్స్‌పోర్ట్ సంస్థలు భాగస్వా ములుగా ఉన్నాయి. కాగా 6,01,427 ఏకే–203 రైఫిళ్ల తయారీ కోసం భారత రక్షణ మంత్రిత్వ శాఖ 2021 డిసెంబర్‌లో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ సుమారు రూ.5 వేల కోట్లుగా ఉంది. కోర్వా ప్లాంట్ నుంచి ఇప్పటివరకు భారత భద్రతా దళాలకు దాదాపు 70 వేల ఏకే–203 రైఫిళ్లను ఇప్పటికే డెలివరీ చేసినట్లు సమాచారం. తాజాగా మందుగుండు సరఫరా ఒప్పందంతో దేశీయ రక్షణ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా అడుగులు పడుతున్నాయి.

# శౌర్యచక్రం వెనక్కి ఇచ్చేస్తా!

- 22 ఏళ్లుగా భూమి కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- శౌర్యచక్ర గ్రహీత తల్లి ఆవేదన



**లక్నో:** దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కుమారుడి వీరత్వానికి దక్కిన శౌర్యచక్రాన్ని తిరిగి ప్రభుత్వానికి ఇచ్చేస్తానంటూ 80 ఏళ్ల వృద్ధ తల్లి చేసిన ప్రకటన ఉత్తరప్రదేశ్‌లో కలకలం రేపింది. మణిపూర్ లో ఉగ్రవాదులతో పోరాడుతూ 2003 జనవరి 8న వీరమరణం పొందిన శౌర్యచక్ర గ్రహీత, మాజీ అసిస్టెంట్ కమాండెంట్ వివేక్ సక్సేనా తల్లి సావిత్రి సక్సేనా.. తన కుటుంబానికి ప్రభుత్వం హామీ ఇచ్చిన భూమి, ఇతర ప్రయోజనాలు 22 ఏళ్లుగా అందకపో వడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుడి త్యాగానికి గుర్తుగా అందిన శౌర్యచక్రం, ఇతర పతకాలు, గౌరవ నగదు పురస్కారాలను తిరిగి తీసు కోవాలని ప్రభుత్వానికే చెప్పే పరిస్థితి వచ్చిందన్నారు. లక్నోలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి తన పెద్ద కుమారుడు రంజిత్‌తో కలిసి హాజరైన సావిత్రి.. వివేక్ సక్సేనా మృతిచెందిన అనంతరం తమ కుటుంబానికి భూమితోపాటు స్మారక పార్కు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. అయితే ఏళ్ల తరబడి ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి ఫైళ్లు తిరుగుతున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. 2016లో అప్పటి లక్నో జిల్లా కలెక్టర్ ఈ అంశాన్ని పరిశీలించి భూమి కేటాయింపు ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించినప్పటికీ.. అనంతరం కుటుంబం ఉత్తరప్రదేశ్ స్థానికులేనని నిరూపించాలంటూ కొత్త నిబంధనలు, పత్రాల డిమాండ్లు ఎదురయ్యాయని రంజిత్ ఆరోపించారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ విసిగిపో యిన సావిత్రి.. 80 ఏళ్ల వయసులో ఇక ఈ తిరుగుళ్లు తన వల్ల కాదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించకపోతే తన కుమారుడికి లభించిన గౌరవాలను తిరిగి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. తన కుమారుడి త్యాగానికి ప్రభుత్వం ఇచ్చిన గౌరవానికి విలువ ఉండాలంటే.. అతని కుటుంబానికి ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్రపతిని కలిసేందుకు సమయం ఇవ్వాలని కూడా ఆమె విజ్ఞప్తి చేశారు. కాగా సావిత్రి ఫిర్యాదుపై స్పందించిన సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్.. కుటుంబం లేవనెత్తిన అంశాలను పరిశీలించి వారం లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఓ సైనికుడి కుటుంబం రెండు దశాబ్దాలకు పైగా తన హక్కుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# సముద్రంలో డ్రగ్ మాఫియా ఫ్యూయల్ స్టేషన్ల ధ్వంసం

- ఈక్వెడార్ నౌకలను అడ్డుకున్న అమెరికా దళాలు
- సిబ్బందిని సురక్షితంగా అప్పగించి అనంతరం నౌకలపై దాడి



**తూర్పు పసిఫిక్:** తూర్పు పసిఫిక్ సముద్ర జలాల్లో అమెరికా సైనిక దళాలు సంచలన ఆపరేషన్ చేపట్టాయి. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సహక రిస్తున్నాయనే ఆరోపణలతో ఈక్వెడార్‌కు చెందిన పలు వాణిజ్య నౌకలను అడ్డుకున్న అమెరికా బలగా లు.. వాటిలోని సిబ్బందిని ముందుగానే సురక్షి తంగా బయటకు తీసి ఈక్వెడార్ అధికారులకు అప్పగించిన అనంతరం నౌకలను సముద్రంలోనే ధ్వంసం చేశాయి. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని ఇరుదేశాల అధికారులు వెల్లడించారు. సెప్టెంబర్ 5, 6 తేదీల్లో ఈ ఆపరేషన్ జరిగినట్లు అమెరికా సదరన్ కమాండ్ తెలిపింది. సముద్రంలో డ్రగ్ స్మగ్లర్లు ఏర్పాటు చేసుకున్న 'తేలియాడే ఫ్యూయల్ స్టేషన్ల'ను లక్ష్యంగా చేసుకుని ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. యూఎస్ఎస్ శాన్ ఆంటోనియో యుద్ధనౌక నుంచి బయలుదేరిన హెలికాప్టర్ల ద్వారా నౌకల్లోని సిబ్బం దిని ముందుగా ఖాళీ చేయించి.. అనంతరం ఆయు ధాలతో దాడి చేసి వాటిని ధ్వంసం చేసినట్లు అమెరికా సైన్యం వెల్లడించింది. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వీడియోను కూడా విడుదల చేసింది. ఈ తేలియాడే ఇంధన కేంద్రాలకు ఈక్వెడార్‌కు చెందిన 'లాస్ చోనెరోస్' నేర ముఠాతో సంబంధాలు ఉన్నట్లు అమెరికా అధికారులు అనుమా నిస్తున్నారు. ఈ సంస్థను అమెరికా ఇప్పటికే విదేశీ ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. సముద్రంలో ఏర్పాటు చేసిన ఈ ఫ్యూయల్ స్టేషన్ల ద్వారా చిన్న చిన్న స్పీడ్ బోట్లకు ఇంధనం నింపి.. వాటి ద్వారా మాదకద్రవ్యాలను ఉత్తర అమెరికా దేశాలకు తరలిస్తు న్నారని ఈక్వెడార్ అంతర్గత వ్యవహారాల మంత్రి జాన్ రీంబెర్గ్ తెలిపారు. కాగా గత ఏడాది కాలంగా అమెరికా చేపడుతున్న 'ఆపరేషన్ సదరన్ స్పియర్'లో భాగంగా జరిగిన నాలుగో ఆపరేషన్ ఇదని అధికారులు వెల్లడించారు. ఈ సుదీర్ఘ ఆపరేషన్‌లో ఇప్పటివరకు 70కి పైగా నౌకలను ధ్వంసం చేయగా.. 220 మందికిపైగా మరణించి నట్లు అంచనా. అయితే తాజా చర్యలో ప్రాణనష్టం జరగకుండా నౌకల్లోని సిబ్బందిని ముందుగానే అదుపులోకి తీసుకున్నారు. సుమారు 28 మంది సిబ్బందిని మాంటా పోర్టులో ఈక్వెడార్ అధికారుల కు అప్పగించినట్లు ఆ దేశ అధికారులు తెలిపారు. మరోవైపు ధ్వంసమైన నౌకల సిబ్బంది బంధువులు అమెరికా ఆరోపణలను ఖండిస్తున్నారు. వారు సాధా రణ మత్స్యకారులేనని, వారి వద్ద ఎలాంటి మాదక ద్రవ్యాలు లభించలేదని వాదిస్తున్నారు. అయితే నేర ముఠాల లాజిస్టిక్స్ వ్యవస్థను దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ సంయుక్త ఆపరేషన్ చేపట్టామని అమెరికా, ఈక్వెడార్ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# డ్రగ్స్ కేసులో టీవీ యాంకర్‌కు మరణశిక్ష

- సారా ఖలీఫాతో పాటు మరో 11 మందికి ఉరిశిక్ష
- తొమ్మిది మందికి జీవిత ఖైదు
- ఏడుగురిని నిర్దోషులుగా విడుదలచేస్తూ ప్రకటన

**కైరో:** భారీ స్థాయిలో మాదకద్రవ్యాల తయారీ, అక్రమ రవాణా కేసులో ఈజిప్టు టీవీ ప్రెజెంటర్ సారా ఖలీఫా (39)తో పాటు మరో 11 మందికి కోర్టు మరణశిక్ష విధించింది. మరో తొమ్మిది మం దికి జీవిత ఖైదు విధించగా.. ఏడుగురిని నిర్దోషు లుగా ప్రకటించింది. సారా ఖలీఫా, ఇతర నింది తులు విదేశాల నుంచి డ్రగ్స్ తయారీకి అవసరమైన ముడి పదార్థాలను అక్రమంగా దిగుమతి చేసుకుని, సింథటిక్ డ్రగ్స్ తయారు చేసి విక్రయించినట్లు ప్రాసిక్యూషన్ ఆరోపించింది. దర్యాప్తులో 750 కిలోలకు పైగా మాదకద్రవ్యాలు, తయారీ పదా ర్థాలను స్వాధీనం చేసుకున్న అధికారులు.. డ్రగ్స్ ల్యాబ్‌లుగా ఉపయోగిస్తున్నట్లు అనుమానిం చిన రెండు అపార్ట్‌మెంట్లను గుర్తించారు. అక్కడ తుపా కులు, మందుగుండు సామగ్రిని కూడా స్వాధీనం చేసుకున్నారు. అయితే తనకు డ్రగ్స్‌తో ఎలాంటి సంబంధం లేదని సారా ఖలీఫా మొదటి నుంచీ ఆరోపణలను ఖండిస్తున్నారు. తాను జీవితంలో సిగరెట్ కూడా కాల్చలేదని విచారణలో చెప్పినట్లు ఈజిప్టు మీడియా పేర్కొంది. తీర్పు నేపథ్యంలో ఆమె తరఫు న్యాయవాది అప్పీల్ చేయనున్నట్లు తెలిపారు.

# పండుగ వేళ స్వీట్లకు షాక్!

- చక్కెర, పాల ధరల పెరుగుదల ప్రభావం
- బిస్కెట్లు, చాక్లెట్లు, లడ్డూల ధరలు పెరిగే అవకాశం

**న్యూఢిల్లీ:** పండుగల సీజన్ సమీపిస్తున్న వేళ చక్కెర ధరల పెరుగుదల వినియోగదారులపై అదనపు భారం మోపే అవకాశముంది. పెరిగిన ముడి సరుకు వ్యయాలతో వినియోగ వస్తువుల తయారీ సంస్థలు ఒత్తిడిని ఎదుర్కొంటుండటంతో బిస్కెట్లు, చాక్లెట్లు, లడ్డూలు, ఇతర మిఠాయి పదా ర్థాల ధరలను పెంచే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దేశంలో సాధారణంగా ఆగస్టు చివరి నుంచి జనవరి వరకు కొనసాగే పండుగల సీజన్‌లో చక్కెరకు డిమాండ్ గరిష్ఠ స్థాయికి చేరుతుంది. సంప్రదాయ స్వీట్లు, పిండివంటలు, చాక్లెట్లు, బిస్కెట్ల వినియోగం ఈ సమయంలో భారీగా పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. అయితే ఈసారి చక్కెరతోపాటు పాల ధరలు కూడా పెరగడంతో మిఠాయి, చాక్లెట్, బిస్కెట్ తయారీ సంస్థల ఉత్పత్తి వ్యయాలు పెరుగుతున్నాయి. ఫలితంగా ఆ భారాన్ని కొంతమేర వినియోగదారు లపై మోపేందుకు కంపెనీలు సిద్ధమవుతున్నాయి. ఈక్విటీస్ సెక్యూరిటీస్ నివేదిక ప్రకారం చక్కెర ధరలు గత ఏడాదితో పోలిస్తే 19 శాతం, గత త్రైమాసికంతో పోలిస్తే 20 శాతం పెరిగాయి. దీంతో బిస్కెట్లు, మిఠాయిలు, మాల్టెడ్ పానీయాలు, కార్బొనేటెడ్ డ్రింక్స్ వంటి చక్కెర అధికంగా వినియోగించే ఉత్పత్తుల తయారీ సంస్థలపై వ్యయభారం మరింత పెరిగింది. పెరిగిన ముడి సరుకు ధరలను ఎదుర్కొ నేందుకు కొన్ని కంపెనీలు నేరుగా ఉత్పత్తుల ధరలను పెంచడంతోపాటు ప్యాక్ పరిమాణాన్ని తగ్గించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నాయి.

# ఎంపీఎస్సీ పారదర్శకత కోసం అభ్యర్థుల ఆందోళన

- పేపర్ లీకులు, పరీక్షల్లో అవకతవకలపై చర్యలు తీసుకోవాలి
- చైర్మన్, కార్యదర్శి రాజీనామా చేయాలని డిమాండ్

**పుణె:** మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపీఎస్సీ) నిర్వహించే పోటీ పరీక్షల్లో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు సోమవారం పుణెలో పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. నియామక ప్రక్రియలో చోటుచేసుకుంటున్న జాప్యాలు, పేపర్ లీకులు, వివిధ పరీక్షల్లో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవా లని డిమాండ్ చేశారు. ఎంపీఎస్సీ చైర్మన్, కార్యదర్శి తమ పదవులకు రాజీనామా చేసి.. వారి స్థానంలో నిజాయితీ, సమర్థత కలిగిన అధికారులను తక్షణమే నియమించాలని కోరారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ (గ్రూప్–బి) పరీక్షకు సంబంధించి అభ్యర్థులు వ్యక్తం చేసిన అభ్యంతరాలపై ఎనిమిది రోజుల్లోగా కమిషన్ స్పష్టమైన వివరణ ఇవ్వాలని, పరీక్షలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకలపై వెంటనే విచారణ ప్రారంభిం చాలని డిమాండ్ చేశారు. 2025 రాష్ట్ర సర్వీసుల ప్రధాన పరీక్షతోపాటు వ్యవసాయ సర్వీసు లకు సంబంధించిన వివరణాత్మక సమాధాన పత్రాల మూల్యాంకనంలో చోటుచేసుకున్న లోపాలపై కూడా సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. ఇదే సమయం లో ముంబై క్రైమ్ బ్రాంచ్ ఎంపీఎస్సీకి సమర్పించిన ప్రాథ మిక నివేదికను ప్రజలకు అందుబాటులో ఉంచాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఎంపీ ఎస్సీ అండర్ సెక్రటరీ అభిజిత్ లెండ్వే పదవీకాలంలో నిర్వహించిన అన్ని పరీక్షలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించి, పరీక్షల నిర్వహణలో ఎక్కడైనా అవకతవ కలు జరిగాయా అన్నది తేల్చాలని కోరారు. ఉద్యోగ నియామకాల్లో ప్రతిభకు ప్రాధాన్యం దక్కాలంటే పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, ఫలితాల ప్రకటనలో పూర్తి పారదర్శక త ఉండాలని అభ్యర్థులు స్పష్టం చేశారు. తమ డిమాం డ్లపై కమిషన్ తక్షణమే స్పందించకపోతే ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

# ప్రత్యర్థిని బట్టి మా ఆట

## ఎప్పుడూ ఒకే ప్రణాళికతో బరిలోకి దిగుతాం: సాత్విక్, చిరాగ్

**షెన్‌జెన్:** తాము ఎప్పుడూ ఒకే ప్రణాళికతో బరిలోకి దిగుతామని భారత స్టార్ షట్లర్ సాత్విక్ సాయిరాజు రంకిరెడ్డి తెలిపాడు. ప్రత్యర్థి ఆటతీరుకు అనుగుణంగా తమ వ్యూహాన్ని మార్చుకుంటామని చెప్పాడు. చిరాగ్ శెట్టితో కలిసి చైనా మాస్టర్స్ పురుషుల డబుల్స్ టైటిల్‌ను గెలిచిన అనంతరం సాత్విక్ ఈ వ్యాఖ్యలు చేశాడు. చైనాకు చెందిన హీ జిటింగ్–రెన్ షియాంగ్యూ జోడీని ఓడించి సాత్విక్–చిరాగ్ జంట ఈ టైటిల్‌ను తొలిసారి సొంతం చేసుకుంది.

### 'ప్లాన్–బి అంటూ ఏమీ ఉండదు'

''మాది ఎప్పుడూ ప్లాన్–ఎనే. ప్లాన్–బి అంటూ ఉండదు. ప్రత్యర్థిని బట్టి మా ఆటతీరు మారుతుంది. వాళ్లు ఎలా ఆడుతున్నారో గమనించి దానికి తగ్గట్టుగా స్పందిస్తాం. చైనా ఆటగాళ్లు వేగంగా ఆడేందుకు ప్రయత్నించారు. అదే మలేసియా, ఇండోనేసియా ఆటగాళ్లైతే అంతగా దూకుడుగా ఆడరు'' అని సాత్విక్ చెప్పాడు. ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ తర్వాత తాము శారీరకంగా మరింత మెరుగయ్యామని సాత్విక్ తెలిపాడు. చైనా మాస్టర్స్‌లో గట్టి పోటీ ఎదుర్కొంటూ విజయం సాధించడం తమ ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని పేర్కొన్నాడు. ఈ విజయం రాబోయే ఆసియా క్రీడలకు ముందు తమకు మరింత ఉత్సాహాన్నిచ్చిందని ఇద్దరూ తెలిపారు.

### వరుసగా మూడు గేమ్‌లు.. మేలు చేసింది

చైనా మాస్టర్స్ ఫైనల్‌కు ముందు తమకు ఎదురైన కఠినమైన మ్యాచ్‌లు ఎంతో ఉపయోగపడ్డాయని చిరాగ్ శెట్టి చెప్పాడు. ''చైనా ఓపెన్‌లో ఐదు మ్యాచ్‌లు ఆడాం. తొలి రౌండ్ మినహా మిగతా అన్ని మ్యాచ్‌ల్లోనూ మూడు గేమ్‌లు ఆడాల్సి వచ్చింది. ఆ అనుభవం మాకు మేలు చేసింది. చైనా మాస్టర్స్‌కు ముందు వారం రోజుల పాటు ప్రాక్టీస్ చేసుకునే అవకాశం లభించింది. అది కూడా మా ఆటకు బాగా ఉపయో గపడింది'' అని చిరాగ్ వివరించాడు. చైనా మాస్టర్స్‌లో వరుసగా కఠినమైన మ్యాచ్‌లు ఆడటం వల్ల ఫైనల్‌కు శారీరకంగా, మానసికంగా మెరుగ్గా సిద్ధమయ్యామని అతడు తెలిపాడు. చైనా మాస్టర్స్ టైటిల్‌తో మంచి ఊపుమీదున్న సాత్విక్–చిరాగ్ జంట ఇప్పుడు ఆసియా క్రీడలపై దృష్టి పెట్టింది. అందుకోసం మరింత కఠినంగా సాధన చేస్తామని చిరాగ్ తెలిపాడు. గతంలోనూ ఆసియా క్రీడల్లో సత్తా చాటిన ఈ జంట.. రాబోయే పోటీల్లోనూ మెరుగైన ప్రదర్శన చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. చైనా మాస్టర్స్ విజయం ఆ దిశగా తమ ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచిందని వారు పేర్కొన్నారు.

# ఇరగదీసిన ఇషాన్

- 39 ఏళ్ల తర్వాత.. దులీప్ ట్రోఫీలో చరిత్ర
- ఫైనల్లో డబుల్ సెంచరీ చేసిన రెండో కెప్టెన్‌గా రికార్డు
- 250 పరుగులతో మెరిసిన ఈస్ట్ జోన్ సారథి
- దినేశ్ కార్తీక్ రికార్డును అధిగమించిన వికెట్‌కీపర్
- ఇషాన్ విధ్వంసంతో భారీ స్కోర్ దిశగా ఈస్ట్ జోన్



**చెన్నై:** టీమిండియా వికెట్‌కీపర్ ఇషాన్ కిషన్ దులీప్ ట్రోఫీ చరిత్రలో అరుదైన ఘనత సాధించాడు. సౌత్ జోన్‌తో చెన్నై వేదికగా జరుగుతున్న ఫైనల్లో ఈస్ట్ జోన్‌కు సారథ్యం వహిస్తున్న ఇషాన్ కిషన్.. 250 పరుగులతో అదరగొట్టాడు. తద్వారా దులీప్ ట్రోఫీ ఫైనల్లో డబుల్ సెంచరీ సాధించిన రెండో కెప్టెన్‌గా రికార్డు నెలకొల్పాడు. 39 ఏళ్ల తర్వాత ఈ ఘనతను అందుకున్న సారథిగా నిలిచాడు.

### 39 ఏళ్ల తర్వాత రికార్డు

1987లో వెస్ట్ జోన్ కెప్టెన్‌గా అన్షుమన్ గైక్వాడ్ నార్త్ జోన్‌తో జరిగిన దులీప్ ట్రోఫీ ఫైనల్లో 216 పరుగులు చేశాడు. ఆ తర్వాత ఫైనల్లో ఏ కెప్టెన్ కూడా డబుల్ సెంచరీ సాధించలేదు. తాజాగా ఇషాన్ కిషన్ 250 పరుగులతో ఆ రికార్డును సమం చేశాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లో డబుల్ సెంచరీ చేసిన ఏడో బ్యాటర్‌గానూ నిలిచాడు. ఇషాన్‌కు ముందు మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ (1967), అన్షుమన్ గైక్వాడ్ (1987), రామన్ లాంబా (1987), యూసుఫ్ పఠాన్, చతేశ్వర్ పుజారా (2016), యశస్వి జైస్వాల్ (2022) ఈ ఘనత సాధించారు.

### దినేశ్ కార్తీక్ రికార్డు బద్దలు

దులీప్ ట్రోఫీ ఫైనల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన వికెట్‌కీపర్‌గా కూడా ఇషాన్ కిషన్ నిలిచాడు. 2010 ఫైనల్లో సౌత్ జోన్ తరఫున దినేశ్ కార్తీక్ 183 పరుగులు చేశాడు. తాజాగా 250 పరుగులతో ఇషాన్ ఆ రికార్డును అధిగమించాడు.
ఇషాన్ కిషన్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో సాధించిన రెండో డబుల్ సెంచరీ ఇది. 2016లో ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌లో అతడు 273 పరుగులు చేశాడు.

### ఈస్ట్ జోన్ భారీ స్కోర్

ఇషాన్ కిషన్ విధ్వంసక ఇన్నింగ్స్‌తో ఈస్ట్ జోన్ భారీ స్కోరు దిశగా దూసుకెళ్తోంది. 154 ఓవర్లు పూర్తయ్యేసరికి 7 వికెట్ల నష్టానికి 684 పరుగులు చేసింది. ఇషాన్ 250 పరుగులతో మెరవగా.. కుమార్ కుశాగ్ర 101 పరుగులతో సెంచరీ నమోదు చేశాడు.
శిఖర్ మోహన్ 85, అభిమన్యు ఈశ్వరన్ 72 పరుగులతో అర్ధ సెంచరీలు సాధించారు. వైభవ్ సూర్యవంశీ 44 పరుగులతో దూకుడుగా ఆడాడు. సౌత్ జోన్ బౌలర్లలో త్రిపురణ విజయ్, చామ మిలింద్ రెండేసి వికెట్లు తీశారు. మిగతా బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. క్రీజులో ఖురాషి (36), మహమ్మద్ షమీ (28) ఉన్నారు.

# క్వార్టర్స్‌లో అల్కరాస్, ఆండ్రీవా

- స్వైటెక్, మెద్వెదెవ్ ఔట్



**న్యూయార్క్:** యుఎస్ ఓపెన్‌లో సీడెడ్ ప్లేయర్ల నిష్క్రమణ కొనసాగుతోంది. మహిళల్లో టైటిల్ ఫేవరెట్ ఇగా స్వైటెక్ ఇంటిముఖం పట్టగా.. పురుషుల్లో రష్యా స్టార్ మెద్వెదెవ్‌కు షాక్ తగిలింది. ఆండ్రీవా, అల్కరాస్, తియాఫో, పెగులా క్వార్టర్స్ చేరారు.
యుఎస్ ఓపెన్లో పోలెండ్ తార ఇగా స్వైటెక్ కథ ముగిసింది. సోమవారం మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ఎనిమిదో సీడ్ స్వైటెక్ 5–7, 3–6తో కిన్వెన్ జెంగ్ (చైనా) చేతిలో కంగుతింది. ఈ పోరులో స్వైటెక్ తొలి సెట్లో మెరుగ్గానే ఆడింది. అయితే పదకొండో గేమ్‌లో సర్వీస్ కోల్పోయి ఆపై సెట్‌ను చేజార్చుకుంది. రెండో సెట్లో స్వైటెక్ కీలక సమయంలో తప్పిదాలు చేసింది. ఏడో గేమ్‌లో సర్వీస్ చేజార్చుకుని ఆపై సెట్‌తో పాటు మ్యాచ్‌ను కోల్పోయింది. 2 డబుల్‌ఫాల్ట్స్, 28 అనవసర తప్పిదాలతో స్వైటెక్ మూల్యం చెల్లించుకుంది. అయిదో సీడ్ మిరా ఆండ్రీవా క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. ప్రిక్వార్టర్స్‌లో ఈ రష్యా అమ్మాయి 5–7, 6–4, 6–3తో పొటపోవా (ఆస్ట్రియా)ను ఓడించింది. రెండున్నర గంటల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో తొలి సెట్ కోల్పోయినా.. ఆండ్రీవా గొప్పగా పుంజుకుని తర్వాతి రెండు సెట్లను ఖాతాలో వేసుకుని విజయాన్ని అందుకుంది. మూడో సెట్ ఆఖర్లో రిటర్న్ చేసే ప్రయత్నంలో పొటపోవా గాయపడింది. అప్పటికే మ్యాచ్ ఆండ్రీవా చేతిలో ఉన్నా.. పొటపోవా మళ్లీ వచ్చి ఆడింది. కాసేపటికే మ్యాచ్ ఆండ్రీవా సొంతమైంది. జెసికా పెగులా (అమెరికా) కూడా క్వార్టర్స్ చేరింది. ప్రిక్వార్టర్స్‌లో మూడో సీడ్ పెగులా 6–3, 6–4తో క్రిస్టియా (రొమేనియా)ను ఓడించింది. ఆరో సీడ్ నోస్కోవా (చెకియా) 7–5, 5–7, 6–4తో కోస్త్యుక్ (ఉక్రెయిన్)పై, ఎమా నవారో (అమెరికా) 6–4, 6–2తో కలిన్‌స్కాయా (రష్యా)పై గెలిచి ముందంజ వేశారు.

**మెద్వెదెవ్‌కు షాక్:** రష్యా స్టార్ డానియల్ మెద్వెదెవ్ ప్రిక్వార్టర్స్‌లో ఓడిపోయాడు. పురుషుల సింగిల్స్‌లో ఏడో సీడ్ మెద్వెదెవ్ 6–7 (1–7), 4–6, 6–7 (6–8)తో పదకొండో సీడ్ తియాఫో (అమెరికా)కు తలొంచాడు. తొలి సెట్లో మెద్వెదెవ్ మెరుగ్గానే ఆడాడు. ఒక దశలో 6–5తో సెట్ గెలిచేందుకు అడుగు దూరంలో నిలిచాడు. అయితే 12వ గేమ్‌లో సర్వీస్ కోల్పోయిన అతడు, ఆపై టైబ్రేకర్‌లో తడబడి సెట్‌ను కోల్పోయాడు. రెండో సెట్‌లోనూ తియాఫో దూకుడు కొనసాగించాడు. అయిదో గేమ్‌లో మెద్వెదెవ్ సర్వీస్ బ్రేక్ చేసిన ఈ అమెరికా కుర్రాడు.. ఆ తర్వాత సెట్ గెలిచి ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకున్నాడు. మ్యాచ్‌లో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మూడో సెట్లో మెద్వెదెవ్ పోరాడాడు. అయితే టైబ్రేకర్‌లో మళ్లీ తప్పులు చేసి సెట్‌తో పాటు మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. డిఫెండింగ్ ఛాంపియన్ కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్) క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ప్రిక్వార్టర్స్‌లో రెండో సీడ్ అల్కరాస్ 6–4, 6–3, 6–4తో టామీ పాల్ (అమెరికా)ను ఓడించాడు. నాలుగుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన అల్కరాస్ తేలిగ్గా విజయాన్ని అందుకున్నాడు. ఎనిమిదో సీడ్ షెల్టాన్ (అమెరికా) క్వార్టర్స్ చేరాడు. అతడు 6–2, 6–3, 6–4తో సిట్సిపాస్ (గ్రీస్) పోరాటానికి తెరదించాడు. ఇంకో ప్రిక్వార్టర్స్ పోరులో మికైల్‌సెన్ (అమెరికా) 7–6 (8–6), 6–4, 6–4తో ఎచెవెరీ (అర్జెంటీనా)పై గెలిచాడు.

**బాలాజీ జోడీ ఔట్:** పురుషుల డబుల్స్‌లో శ్రీరామ్ బాలాజీ కథ ముగిసింది. తొలి రౌండ్లో బాలాజీ–ఎవాన్ కింగ్ (అమెరికా) జంట 4–6, 5–7తో హ్యూగో (మొనాకో)–వెస్లిన్ (ఫ్రాన్స్) జోడీ చేతిలో ఓడింది. జూనియర్ బాలికల సింగిల్స్‌లో మాయ రాజేశ్వరన్ శుభారంభం చేసింది. తొలి రౌండ్లో ఆమె 6–2, 6–2తో ఎమెరీ కోంబ్స్ (అమెరికా)ను ఓడించింది. ఈ క్రమంలో ఈ భారత అమ్మాయి 4 ఏస్‌లు, 12 విన్నర్లు కొట్టింది. జూనియర్ బాలుర సింగిల్స్ తొలి రౌండ్లో అర్ణవ్ పపార్కర్ 4–6, 1–6తో జాన్సన్ (అమెరికా) చేతిలో ఓడాడు.

# పాక్ క్రికెట్‌లో ఫిక్సింగ్ కలకలం

- రిజ్వాన్, ఇమామ్‌పై విచారణ
- ఇంగ్లండ్ పర్యటనలో ఆటగాళ్ల ప్రవర్తనపై పీసీబీ అంతర్గత దర్యాప్తు
- సెలెక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం
- సోషల్ మీడియా వార్తలను నమ్మొద్దన్న పీసీబీ



**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ క్రికెట్‌లో సంక్షోభం మరింత ముదురుతోంది. ఇంగ్లండ్ పర్యటనలో జట్టు పేలవ ప్రదర్శనకు తోడు.. కొందరు ఆటగాళ్లపై ఫిక్సింగ్ ఆరోపణలు రావడం తీవ్ర చర్చకు దారితీసింది. ముఖ్యంగా వికెట్‌కీపర్ మహమ్మద్ రిజ్వాన్, బ్యాటర్ ఇమామ్ ఉల్ హక్ ఆఫ్ ఫీల్డ్ ప్రవర్తన అనుమానాస్పదంగా ఉందంటూ వచ్చిన వార్తలు కలకలం రేపుతున్నాయి. ఈ వ్యవహారంపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అంతర్గత విచారణకు ఆదేశించినట్లు ఆ సంస్థ మీడియా ప్రతినిధి అమీర్ మీర్ వెల్లడించారు.

### రిజ్వాన్, ఇమామ్ చిక్కుల్లో?

ఇంగ్లండ్ పర్యటనలో పాకిస్థాన్ వరుస పరాజయాలు చవిచూసింది. సిరీస్‌లో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ఓటమితో సిరీస్‌ను కోల్పోయింది. ఈ నేపథ్యంలో జట్టు ప్రదర్శనతో పాటు ఆటగాళ్ల క్రమశిక్షణ, ప్రవర్తనపై కూడా విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలో రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్ సహా కొందరు ఆటగాళ్లపై ఫిక్సింగ్ ఆరోపణలు వచ్చినట్లు పాక్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. వేటుకు గురైన ఏడుగురు ఆటగాళ్లలో ఉన్న రిజ్వాన్, ఇమామ్‌కు సంబంధించిన మొబైల్ డేటాను పీసీబీ పరిశీలిస్తున్నట్లు 'జియో న్యూస్' కథనం వెల్లడించింది. వారు ఎవరెవరితో సంప్రదింపులు జరిపారన్న అంశంపైనా అధికారులు దృష్టి సారించినట్లు పేర్కొంది. అయితే ఫిక్సింగ్ ఆరోపణలకు సంబంధించి పీసీబీ నుంచి ఇప్పటివరకు ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు.

### ఆటగాళ్ల మొబైల్స్ స్వాధీనం?

మరోవైపు ఇంగ్లండ్‌తో మూడో టెస్టు ఆడే పాకిస్థాన్ ఆటగాళ్ల నుంచి పీసీబీ మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు '365 న్యూస్' కథనం పేర్కొంది. మ్యాచ్ పూర్తయ్యే వరకు వాటిని తిరిగి ఇవ్వబోమని బోర్డు స్పష్టం చేసినట్లు తెలిపింది. ఇంగ్లండ్‌తో మూడో టెస్టు బర్మింగ్‌హామ్ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి ప్రారంభం కానుంది. అలాగే రిజ్వాన్, ఇమామ్‌లను ఇంగ్లండ్ పర్యటనకు ఎంపిక చేయడంపై సెలెక్టర్లకు పీసీబీ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు కూడా వార్తలు వచ్చాయి.

### 'మీడియా కథనాలపై విచారణ'

ఆటగాళ్ల క్రమశిక్షణ, ప్రవర్తనపై మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో అంతర్గత విచారణకు ఆదేశించినట్లు పీసీబీ మీడియా ప్రతినిధి అమీర్ మీర్ సోమవారం తెలిపారు. పీసీబీ ప్రమాణాలు, నియమనిబంధనలకు అనుగుణంగానే విచారణ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు, కథనాలను విశ్వసించవద్దని అభిమానులకు సూచించారు. పీసీబీ నుంచి అధికారికంగా వెలువడే సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.అయితే ఆటగాళ్ల మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారన్న వార్తలపై అమీర్ మీర్ స్పందించలేదు.

### ఇప్పటికే భారీగా మార్పులు

ఇంగ్లండ్ పర్యటనలో పాకిస్థాన్ జట్టు పేలవ ప్రదర్శన నేపథ్యంలో పీసీబీ ఇప్పటికే కీలక చర్యలు చేపట్టింది. హెడ్ కోచ్, బౌలింగ్ కోచ్‌తో పాటు ఏడుగురు ఆటగాళ్లపై వేటు వేసినట్లు సమాచారం. దీంతో పాక్ క్రికెట్ వ్యవహారం దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగానూ చర్చనీయాం శంగా మారింది.ఫిక్సింగ్ ఆరోపణలపై కొనసాగుతున్న అంతర్గత విచారణలో ఎలాంటి విషయాలు వెలుగులోకి వస్తాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# మళ్లీ ధరలు పెంచిన మారుతీ సుజుకీ



**ముంబై:** ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ తన వినియోగదారులకు మళ్లీ ధరల షాక్ ఇచ్చింది. ఎంపిక చేసిన కొన్ని మోడళ్లపై రూ.20 వేల వరకు ధరలను పెంచుతున్నట్లు కంపెనీ ప్రకటించింది. సవరించిన ధరలు సెప్టెంబర్ నుంచే అమల్లోకి వస్తాయని కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, ముడిసరుకుల ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది. కాగా.. ఈ ఏడాది మే నెల నుంచి మారుతీ సుజుకీ కార్ల ధరలు పెరగడం ఇది మూడోసారి కావడం గమనార్హం.
''గత కొన్ని నెలలుగా వ్యయాన్ని నియంత్రించి ధరలను అందుబాటులోనే ఉంచేందుకు ప్రయత్నించాం. కానీ ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, ప్రతికూల ఆర్థిక పరిస్థితుల వల్ల అనివార్యంగా ధరలు పెంచాల్సి వస్తోంది. ఎంపిక చేసిన మోడళ్ల ధరలను రూ.20 వేల వరకు పెంచాం'' అని కంపెనీ వెల్లడించింది. వినియోగదారులపై ఈ భారం సాధ్యమైనంత తక్కువగా ఉండేలా చూసుకుంటామని తెలిపింది. మారుతీ సుజుకీ ప్రస్తుతం ఎస్–ప్రెస్సో వంటి ఎంట్రీలెవల్ మోడళ్ల నుంచి ప్రీమియం యుటిలిటీ వెహికల్ అయిన ఇన్విక్టో వరకు పలు మోడళ్లను విక్రయిస్తోంది.

# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రుణగ్రహీతలకు ఊరట

- ఎంసీఎల్ఆర్ తగ్గింపు
- ఎంపిక చేసిన కాలపరిమితులపై 5–10 బేసిస్ పాయింట్ల కోత
- సెప్టెంబర్ 7 నుంచే కొత్త రేట్లు అమల్లోకి



**ముంబయి:** హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రుణగ్రహీతలకు ఊరట కల్పించే నిర్ణయం తీసుకుంది. వివిధ కాలపరిమితులకు సంబంధించిన నిధుల ఆధారిత రుణ రేట్లను (ఎంసీఎల్ఆర్) 5 నుంచి 10 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. సవరించిన రేట్లు సెప్టెంబర్ 7, 2026 నుంచి అమల్లోకి వచ్చాయి. దీంతో బ్యాంక్ ఎంసీఎల్ఆర్ పరిధి 7.90 శాతం నుంచి 8.60 శాతానికి చేరింది. గతంలో ఇది 8 శాతం నుంచి 8.65 శాతం మధ్య ఉండేది.

**ఓవర్‌నైట్:** 8.00 శాతం నుంచి 7.90 శాతానికి తగ్గింపు.
**1 నెల:** 8.00 శాతం నుంచి 7.90 శాతానికి తగ్గింపు.
**3 నెలలు:** 8.15 శాతం నుంచి 8.05 శాతానికి తగ్గింపు.
**6 నెలలు:** 8.30 శాతం నుంచి 8.25 శాతానికి తగ్గింపు.
**1 సంవత్సరం:** 8.40 శాతం నుంచి 8.35 శాతానికి తగ్గింపు.
**2 సంవత్సరాలు:** 8.55 శాతం నుంచి 8.45 శాతానికి తగ్గింపు.
**3 సంవత్సరాలు:** 8.65 శాతం నుంచి 8.60 శాతానికి తగ్గింపు.

### రుణగ్రహీతలకు ఏం ప్రయోజనం?

ఎంసీఎల్ఆర్‌తో అనుసంధానమైన రుణాలపై వడ్డీ రేట్లను నిర్ణయించడంలో ఈ బెంచ్‌మార్క్ కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల ఎంసీఎల్ఆర్ ఆధారిత రుణాలు ఉన్న వారికి ఈ తగ్గింపు కొంత ఊరటనిచ్చే అవకాశం ఉంది. అయితే రుణం రీసెట్ తేదీ, రుణ ఒప్పందంలోని నిబంధనలను బట్టి వడ్డీ రేటు, ఈఎంఐపై ప్రభావం మారవచ్చు.హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్‌లోనూ ఎంసీఎల్ఆర్, ఇతర రుణ బెంచ్‌మార్క్ రేట్ల వివరాలను అందుబాటులో ఉంచింది.

# పెట్రోల్‌ను దాటిన ప్రత్యామ్నాయ ఇంధన వాహనాలు

- ఆగస్టులో తొలిసారిగా పెట్రోల్ వాహనాల కంటే సీఎన్‌జీ, హైబ్రిడ్, ఈవీలకు అధిక అమ్మకాలు
- ప్యాసింజర్ వాహనాల విక్రయాల్లో 41.95 శాతం వాటా
- పెట్రోల్ వాహనాల వాటా 40.85 శాతానికి పరిమితం
- ఇంధన ఖర్చు తగ్గించుకునేందుకు ప్రత్యామ్నాయాల వైపు కొనుగోలుదారులు




**న్యూఢిల్లీ:** భారత ఆటో రిటైల్ మార్కెట్‌లో కీలక మార్పు చోటుచేసుకుంది. దేశంలో తొలిసారిగా ఆగస్టు నెలలో సీఎన్‌జీ, హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) అమ్మకాలు పెట్రోల్ వాహనాల విక్రయాలను అధిగమించాయి. ఈ మూడు రకాల ప్రత్యామ్నాయ ఇంధన వాహనాలు కలిపి ప్యాసింజర్ వెహికల్స్ విక్రయాల్లో 41.95 శాతం వాటాను దక్కించుకున్నాయి. అదే సమయంలో పెట్రోల్ వాహనాల వాటా 40.85 శాతానికి పరిమితమైంది.

### ఏడాది కాలంలో భారీ మార్పు

గతేడాది ఆగస్టులో ప్యాసింజర్ వాహనాల విక్రయాల్లో పెట్రోల్ వాహనాల వాటా 46 శాతంగా ఉంది. ఏడాది వ్యవధిలో ఆ వాటా గణనీయంగా తగ్గడం.. ప్రత్యామ్నాయ ఇంధన వాహనాలపై వినియోగదారుల్లో పెరుగుతున్న ఆసక్తికి సంకేతంగా పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.
ఈ20 పెట్రోల్ వినియోగంపై నెలకొన్న సందేహాలతో పాటు.. ఇంధన వ్యయాన్ని తగ్గించుకోవాలనే ఉద్దేశంతో కొనుగోలుదారులు సీఎన్‌జీ, హైబ్రిడ్, ఈవీల వైపు మొగ్గుచూపుతున్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

### ఆటో రిటైల్‌లో రికార్డు వృద్ధి

ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఫాడా) గణాంకాల ప్రకారం.. 2025–26 ఆర్థిక సంవత్సరంలో దేశీయ ఆటోమొబైల్ రిటైల్ రంగం 2,96,71,064 యూనిట్ల విక్రయాలతో సరికొత్త రికార్డు నమోదు చేసింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 13.30 శాతం వృద్ధి. ఈ ఏడాది ఆగస్టులో దేశవ్యాప్తంగా రిటైల్ వాహనాల విక్రయాలు 24,23,201 యూనిట్లుగా నమోద య్యాయి. గతేడాది ఆగస్టుతో పోలిస్తే విక్రయాలు 17.51 శాతం పెరిగాయి.

### మారుతున్న కొనుగోలు ధోరణి

మొత్తంగా చూస్తే దేశీయ ఆటో మార్కెట్‌లో వినియోగదారుల ప్రాధాన్యాలు క్రమంగా మారుతున్నాయి. ఇంధన ఖర్చులు, పర్యావరణ అంశాలు, కొత్త టెక్నాలజీలపై పెరుగుతున్న అవగాహన నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఇంధన వాహనాలకు డిమాండ్ పెరుగుతోంది. ఆగస్టు విక్రయ గణాంకాలు ఈ మార్పుకు మరింత బలాన్ని చేకూర్చాయి.

# ఫోల్డబుల్ ఐఫోన్ వస్తుందా?

## డమ్మీ యూనిట్లతో ఊపందుకున్న ప్రచారం

**న్యూఢిల్లీ:** అమెరికా టెక్ దిగ్గజం యాపిల్ సెప్టెంబర్ 9న కొత్త ఐఫోన్ సిరీస్‌ను ఆవిష్కరించనుంది. ఐఫోన్ 18 ప్రో, ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్‌తో పాటు సంస్థ తొలిసారిగా ఫోల్డబుల్ ఐఫోన్‌ను కూడా పరిచయం చేయొచ్చనే ప్రచారం టెక్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. దీనిపై యాపిల్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.
అయితే సోషల్ మీడియాలో ఫోల్డబుల్ ఐఫోన్‌కు సంబంధించినవిగా చెబుతున్న కొన్ని డమ్మీ యూనిట్లు వైరల్ అవుతున్నాయి. ఐఫోన్ 18 ప్రో మోడళ్లతో పోలిస్తే.. ఫోల్డబుల్ మోడల్ డిజైన్, ఫీచర్లలో పలు మార్పులు ఉండొచ్చని లీక్‌ల ఆధారంగా తెలుస్తోంది.

### టచ్ ఐడీకి తిరిగి..?

ఫోల్డబుల్ ఐఫోన్‌లో ఫేస్ ఐడీ ఉండకపోవచ్చనే ప్రచారం జరుగుతోంది. ఫోన్ పలుచగా ఉండేలా డిజైన్ చేయడంతో.. ఫేస్ ఐడీకి అవసరమైన సెన్సార్లకు స్థలం సరిపోకపోవచ్చని టెక్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అందుకే పవర్ బటన్‌లోనే ఫింగర్‌ప్రింట్ సెన్సార్‌ను ఏర్పాటు చేసి టచ్ ఐడీని అందించే అవకాశం ఉందని సమాచారం.

### రెండు 48 ఎంపీ కెమెరాలే?

కెమెరాల విషయంలోనూ ప్రో మోడళ్లకు భిన్నమైన సెటప్ ఉండొచ్చని తెలుస్తోంది. ఫోల్డబుల్ ఐఫోన్ వెనుక భాగంలో 48 ఎంపీ వైడ్, 48 ఎంపీ అల్ట్రావైడ్ కెమెరాలు మాత్రమే ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. టెలిఫోటో కెమెరాను ఇందులో తొలగించే అవకాశం ఉందని లీక్‌లు సూచిస్తున్నాయి.

### రెండు డిస్‌ప్లేలు

ఫోల్డబుల్ ఐఫోన్ 5.5 అంగుళాల ఔటర్ డిస్‌ప్లే, 7.8 అంగుళాల ఇన్నర్ డిస్‌ప్లేతో వచ్చే అవకాశం ఉందని సమాచారం. ఫోన్‌ను విప్పినప్పుడు ట్యాబ్లెట్ తరహా పెద్ద స్క్రీన్ అందుబాటులోకి రానుంది. స్క్రీన్ మధ్యలో మడత గుర్తు పెద్దగా కనిపించకుండా ఉండేందుకు ప్రత్యేకమైన 'లిక్విడ్ మెటల్ హింజ్' సాంకేతికతను ఉపయోగించినట్లు కూడా ప్రచారం జరుగుతోంది.

### పైభాగంలో వాల్యూమ్ బటన్లు?

ఫోల్డబుల్ డిజైన్‌కు అనుగుణంగా వాల్యూమ్ బటన్ల స్థానంలోనూ మార్పులు ఉండొచ్చని తెలుస్తోంది. వాటిని ఫోన్ పైభాగంలో కుడివైపు ఏర్పాటు చేసే అవకాశం ఉందని సమాచారం. అలాగే ఫిజికల్ సిమ్ కార్డు స్లాట్ లేకుండా.. కేవలం ఈ–సిమ్ (eSIM)కు మాత్రమే మద్దతు ఇచ్చే అవకాశం ఉందని లీక్‌లు చెబుతున్నాయి. అయితే ఈ ఫీచర్లు, డిజైన్ వివరాలేవీ యాపిల్ అధికారికంగా ధ్రువీకరించలేదు. సెప్టెంబర్ 9న జరిగే సంస్థ ఈవెంట్‌లోనే ఫోల్డబుల్ ఐఫోన్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# 23,800 దిగువకు నిఫ్టీ

- సెన్సెక్స్ 383 పాయింట్లు డౌన్
- అంతర్జాతీయ ప్రతికూలతలు.. చమురు ధరల పెరుగుదల
- 3 శాతానికి పైగా కుంగిన ఇన్ఫోసిస్



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితులు, చమురు ధరలు పెరగడం మార్కెట్‌పై ప్రభావం చూపింది. అమెరికా వడ్డీ రేట్లను పెంచుతుందనే భయాలతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ఐటీ, మెటల్, పీఎస్‌యూ బ్యాంకు షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. ఇన్ఫోసిస్ షేర్లు 3 శాతానికి పైగా కుంగాయి. టాటా స్టీల్, టెక్ మహీంద్రా షేర్లు 2 శాతం మేర పడ్డాయి. దీంతో సూచీలకు నష్టాలు తప్పలేదు.
సెన్సెక్స్ ఉదయం 76,446.05 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,515.43) నష్టాల్లో ప్రారంభమైన సూచీ.. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 75,970.52 వద్ద కనిష్ఠానికి పడిపోయి.. చివరికి 382.62 పాయింట్లు పతనమై 76,132.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 118.55 పాయింట్లు కోల్పోయి 23,779.15 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.48గా ఉంది.
సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, టెక్‌మహీంద్రా, టాటాస్టీల్, బజాజ్‌ఫిన్‌సర్వ్, అల్ట్రా సిమెంట్, టీసీఎస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఎల్‌అండ్‌టీ, భారతీ ఎయిర్‌టెల్, మారుతీ, పవర్‌గ్రిడ్, ఐసీఐసీఐ, ఇండిగో షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 96.64 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర 4,402.79 వద్ద కొనసాగుతోంది.



# శ్రీవిష్ణుకు జోడీగా.. ఆషికా రంగనాథ్?

'నా సామిరంగ', 'అమిగోస్' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్న కన్నడ బ్యూటీ ఆషికా రంగనాథ్ టాలీవుడ్‌లో వరుస అవకాశాలతో దూసుకెళ్తోంది. గ్లామర్‌తో పాటు తనదైన అభినయంతోనూ ఆకట్టుకుం టున్న ఈ భామ.. ప్రస్తుతం సౌత్‌లో మంచి డిమాండ్ ఉన్న కథానాయికగా మారుతోంది. ఇప్పటికే పలు క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఆషికా రంగనాథ్ త్వరలో 'సర్దార్ 2' సినిమాతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమవుతోంది. ఇదిలా ఉంటే.. ఈ అమ్మడికి మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా అవకాశం దక్కినట్లు నెట్టింట వార్తలు వైరల్ అవుతున్నాయి. వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ను సొంతం చేసుకున్న యంగ్ హీరో శ్రీవిష్ణుకు జోడీగా ఆషికా రంగనాథ్ నటించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న 'ప్రొడక్షన్ నంబర్ 39'లో ఆమె హీరోయిన్‌గా ఎంపికైనట్లు సమాచారం. 'అనగనగా' ఫేమ్ సన్నీ సంజయ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ ప్రారంభమైన ఈ మూవీ శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నట్లు తెలుస్తోంది. నేటి తరం యువత జీవితాల్లో ఎదురయ్యే కాంప్లికేషన్స్, రిలేషన్‌షిప్స్, ప్రేమ, భావోద్వేగాల చుట్టూ ఈ కథ సాగనున్నట్లు సమాచారం. యూత్‌కు కనెక్ట్ అయ్యే అంశాలతో పాటు ఫీల్‌గుడ్ ఎమోషన్స్‌కు ప్రాధాన్యతనిస్తూ దర్శకుడు సన్నీ సంజయ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తు న్నట్లు తెలుస్తోంది. ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ కూడా ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. ముఖ్యంగా శ్రీవిష్ణు పాత్ర, కథా నేపథ్యం సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ఇలాంటి సమయంలో ఆషికా రంగనాథ్ ఈ ప్రాజెక్ట్‌లోకి హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వనున్నారనే వార్త మూవీపై మరింత హైప్‌ను తీసుకొచ్చింది. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. కథకు తగ్గట్టుగా కొత్తదనంతో కూడిన ట్రీట్‌మెంట్‌తో ఈ సినిమా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఇక ఆషికా రంగనాథ్ కెరీర్ విషయానికొస్తే.. ఇప్పటికే 'విశ్వం భర' వంటి భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో భాగమైన ఈ అమ్మడు కన్నడ, తెలుగు, తమిళ భాషల్లో వరుస అవకాశాలు అందుకుంటూ తన మార్కెట్‌ను విస్తరిస్తోంది. వచ్చిన ప్రతి అవకాశాన్ని విభిన్నంగా ఉప యోగించుకుంటూ కెరీర్‌లో మంచి జోరు మీదున్న ఆషికా.. శ్రీవిష్ణుతో జతకట్టనున్న ఈ ప్రాజెక్ట్‌తో మరోసారి తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటుం దేమో చూడాలి.

# 'వారణాసి'.. ఊహలకు అందని రేంజ్‌లో!

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్‌స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ 'వారణాసి'పై రోజురోజుకూ అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుండగా.. మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. కేఎల్ నారాయణ, ఎస్.ఎస్. కార్తికేయ నిర్మిస్తున్న ఈ భారీ అడ్వెంచరస్ ప్రాజెక్ట్‌కు ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా గురించి ప్రతిరోజూ ఏదో ఒక ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంది. ఈ క్రమంలో తాజాగా



ఓ ఇంటర్వ్యూలో రాజమౌళి 'వారణాసి' గురించి చేసిన వ్యాఖ్యలు సినిమాపై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లాయి. తన కెరీర్‌లోనే 'వారణాసి' అత్యంత భారీ, ప్రతిష్టాత్మకమైన సినిమా అని రాజమౌళి చెప్పడం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తనకు సాహసాలు, అడ్వెంచర్ కాన్సెప్ట్స్ అంటే ఎంతో ఇష్టమని, అదే ఆలోచనతో ఈ కథను మొదలుపెట్టామని ఆయన తెలిపారు. అయితే సినిమా పనులు ప్రారంభమైన తర్వాత కథ, దాని ప్రపంచం, స్కేల్ ఊహించిన దానికంటే ఎన్నో రెట్లు పెరిగిపోయిందని వెల్లడించారు. ముఖ్యంగా ఈ సినిమా ప్రేక్షకులను ఒకే ప్రాంతానికి పరిమితం చేయకుండా.. ప్రపంచంలోని విభిన్న ప్రదేశాలకు తీసుకెళ్లబోతున్నట్లు రాజమౌళి చెప్పడంతో అభిమానుల్లో మరింత క్యూరియాసిటీ పెరిగింది. అంటార్కిటికాలోని మంచు కొండల నుంచి ఆఫ్రికా అడవుల వరకు కథ ప్రయాణిస్తుందని, అక్కడి నుంచి ఏకంగా త్రేతాయుగంలోని శ్రీరాముడి కాలానికి కూడా ప్రేక్షకులను తీసుకెళ్తుందని ఆయన వివరించారు. ఆ కాలంలో భారీ దైవిక రూపాలతో పాటు, ఇంతకుముందెన్నడూ చూడని సరికొత్త ప్రపంచాన్ని ప్రేక్షకులు చూస్తారని రాజమౌళి చెప్పుకొచ్చారు. దీంతో 'వారణాసి' కేవలం ఒక అడ్వెంచర్ సినిమా మాత్రమే కాదని, భారీ విజువల్ వండర్స్‌తో కూడిన ఒక ప్రత్యేకమైన సినిమాటిక్ జర్నీగా ఉండబోతోందనే ఆసక్తి నెలకొంది. అయితే ఈ అద్భుతమైన ప్రయాణం, భారీ యాక్షన్, విజువల్ గ్రాండియర్ వెనుక అత్యంత బలమైన భావోద్వేగ కథ ఉంటుందని రాజమౌళి వెల్లడించారు. ముఖ్యంగా తండ్రి, కొడుకు మధ్య ఉండే గాఢమైన అనుబంధమే ఈ సినిమాకు అసలైన మూలమని ఆయన పేర్కొన్నారు. అంటే ఒకవైపు ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే స్థాయిలో అడ్వెంచర్, మరోవైపు హృదయాలను హత్తుకునే ఎమోషన్ 'వారణాసి'లో ఉండబోతున్నట్లు ఆయన మాటలతో స్పష్టమవుతోంది. ఇప్పటికే మహేష్ బాబు–రాజమౌళి కాంబినేషన్‌పై ఉన్న క్రేజ్‌కు తోడు.. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి భారీ తారాగణం, కీరవాణి సంగీతం, అంతర్జాతీయ స్థాయి నిర్మాణ విలువలు సినిమాపై హైప్‌ను మరింత పెంచుతున్నాయి. తాజాగా రాజమౌళి చేసిన ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో 'వారణాసి' ఎలాంటి అద్భుతాన్ని తెరపై ఆవిష్కరించబోతోందోనన్న ఆసక్తి మరింత పెరిగింది.

# మమ్ముట్టి 'మేళా'.. మాస్ లుక్‌లో మెగాస్టార్!

మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి అంటేనే విభిన్నమైన కథలు.. విలక్షణమైన పాత్రలు.. ఊహించని గెటప్స్‌కు కేరాఫ్ అడ్రస్. వయసు పెరుగుతున్న కొద్దీ తనలోని నటుడికి మరింత పదును పెడుతూ, వరుస ప్రయోగాలతో ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేస్తున్న ఆయన మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్‌తో రెడీ అవుతున్నారు. ఇప్పటికే హీరోగా పలు క్రేజీ సినిమాలతో బిజీగా ఉన్న మమ్ముట్టి.. మరోవైపు కీలక పాత్రలు చేస్తూ తనదైన మార్క్ చూపిస్తున్నారు. ప్రస్తుతం ధనుష్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'ఓమ్'లో కీలక పాత్రలో కనిపించనున్న ఈ మెగాస్టార్.. ఇప్పుడు తన అభిమానులకు మరో సాలిడ్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. తన సొంత నిర్మాణ సంస్థ 'మమ్ముట్టి కంపెనీ' బ్యానర్‌పై తెరకెక్కుతున్న కొత్త సినిమాను అనౌన్స్ చేస్తూ ఆసక్తి రేపారు. మమ్ముట్టి కంపెనీ ప్రొడక్షన్ నంబర్ 9గా రూపొందుతున్న ఈ చిత్రంలో మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటించడమే కాకుండా నిర్మాతగానూ వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాకు 'మేళా' అనే వెరైటీ టైటిల్‌ను ఖరారు చేసిన మేకర్స్.. తాజాగా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేసి



ఒక్కసారిగా క్యూరియాసిటీ పెంచేశారు. ఫస్ట్ లుక్‌లో ఇంట్లోని వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడిపోయి ఉండగా.. వాటి మధ్యలో బ్లాక్ డ్రెస్‌లో మమ్ముట్టి కనిపిస్తున్న తీరు సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఆయన పవర్‌ఫుల్ ఎక్స్‌ప్రెషన్, స్టైలిష్ లుక్ చూస్తుంటే.. ఈసారి మెగాస్టార్ ఏదో కొత్తగా చూపించబోతున్నారనే ఫీలింగ్ కలుగుతోంది. 'ఫాలిమి' వంటి సూపర్‌హిట్ కామెడీ డ్రామాతో తన టాలెంట్‌ను నిరూపించుకున్న దర్శకుడు నితీష్ సహదేవ్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. దీంతో 'మేళా'లో మమ్ముట్టిని నితీష్ ఏ తరహా పాత్రలో చూపించబోతున్నారనే ఆసక్తి మొదలైంది. ఇక ఈ ప్రాజెక్ట్‌లో మరో క్రేజీ కాంబి నేషన్ కూడా ఉంది. మమ్ముట్టి కంపెనీతో పాటు ఆయన తనయుడు, స్టార్ హీరో దుల్కర్ సల్మాన్‌కు చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ వేఫారర్ ఫిల్మ్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. తండ్రి, కొడుకులకు చెందిన నిర్మాణ సంస్థలు కలిసి ఓ సినిమాను నిర్మించడం ఈ ప్రాజెక్ట్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. కథలో కొత్తదనం, మమ్ముట్టి పాత్ర లోని వైవిధ్యం, నితీష్ సహదేవ్ టేకింగ్, రెండు ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థల కలయిక.. ఇలా అన్ని అంశాలు సినిమాపై ఆసక్తిని పెంచు తున్నాయి. మొత్తానికి ఫస్ట్ లుక్‌తోనే తనదైన స్టైల్లో హైప్ క్రియేట్ చేసిన మమ్ముట్టి.. 'మేళా'తో ఎలాంటి మ్యాజిక్ చేయబోతున్నారో చూడాలంటే మరికొంత కాలం వెయిట్ చేయాల్సిందే.

# 'రాకా'లో బబ్లూ పృథ్వీరాజ్.. సీక్రెట్ రివీల్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ ప్రెస్టీజియస్ పాన్ వరల్డ్ మూవీ 'రాకా'పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో గ్లామర్ క్వీన్ దీపికా పదుకొణె కథానాయికగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేయగా.. ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రతి చిన్న అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది. ఈ క్రమంలో నటుడు బబ్లూ పృథ్వీరాజ్ ఈ సినిమాలో తన పాత్రపై ఆసక్తికర విషయాలను వెల్లడించి సర్‌ప్రైజ్ చేశారు. 'రాకా'లో తాను చాలా కీలకమైన, యూనిక్ పాత్రలో నటిస్తున్నానని తెలిపారు. అల్లు అర్జున్, దీపికా పదుకొణెతో కలిసి తనకు ప్రత్యేకమైన సన్నివేశాలు ఉన్నాయని చెప్పిన ఆయన.. అల్లు అర్జున్‌తో కలిసి నటించడం తన కల నిజమైనట్లుగా ఉందని పేర్కొన్నారు. అయితే సినిమా కథ, తన పాత్రకు సంబంధించిన వివరాలను మాత్రం వెల్లడించలేనని స్పష్టం చేశారు. షూటింగ్ మొదటి రోజే కథలోని విషయాలు బయటకు రాకుండా బౌండ్ స్క్రిప్ట్ ఇచ్చి సంతకం చేయించుకున్నారని, అందుకే పాత్ర గురించి ఎక్కువగా చెప్పడం సాధ్యం కాదని తెలిపారు. ఈ సినిమా కోసం హాలీవుడ్ స్థాయి విజువల్స్, అత్యున్నత సాంకేతిక నిపుణులు, ప్రతిభావంతులైన నటీనటులు పనిచేస్తున్నారని వెల్లడించారు. ప్రతి సన్నివేశాన్ని మేకర్స్ ఎంతో డిటైలింగ్‌తో తెరకెక్కిస్తున్నా రని, చిన్న విషయానికి కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు.




# బిగ్ బాస్ హోస్టుల రెమ్యూనరేషన్ ఇదేనా?

బుల్లితెర ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రియాలిటీ షో 'బిగ్ బాస్' కొత్త సీజన్ గ్రాండ్‌గా ప్రారంభమైంది. సెప్టెంబర్ 6న ఒకేసారి ఆరు భాషల్లో స్ట్రీమింగ్ అవుతూ ఇండియన్ టెలివిజన్ చరిత్రలో సరికొత్త అధ్యాయానికి తెరలేపింది. జియో హాట్‌స్టార్, కలర్స్ టీవీలలో గ్రాండ్ లాంచ్ టెలికాస్ట్ కావడంతో దేశవ్యాప్తంగా బిగ్ బాస్ అభిమానుల్లో సందడి నెలకొంది. ఇదిలా ఉంటే.. ప్రతి సీజన్‌లోనూ హోస్టులుగా వ్యవహరించే స్టార్ హీరోల పారితోషికం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తాజా సమాచారం ప్రకారం.. తెలుగు బిగ్ బాస్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న కింగ్ నాగార్జున ఈ సీజన్‌కు సుమారు రూ.35 నుంచి రూ.40 కోట్ల వరకు పారితోషికం అందుకోనున్నారనే టాక్ వినిపిస్తోంది. తమిళంలో హోస్ట్‌గా ఉన్న విజయ్ సేతుపతి రూ.75–80 కోట్లు, మలయాళంలో లెజెండరీ నటుడు మోహన్‌లాల్ దాదాపు రూ.30 కోట్లు, కన్నడలో కిచ్చా సుదీప్ సుమారు రూ.20 కోట్ల వరకు అందుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది. అయితే వీరందరినీ మించి బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ ఏకంగా రూ.125 కోట్ల భారీ పారితోషికంతో టాప్‌లో ఉన్నారని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. మరోవైపు సౌరవ్ గంగూలీ నాలుగేళ్ల ఒప్పందానికి రూ.125 కోట్ల వరకు డీల్ కుదుర్చుకున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. అయితే ఈ రెమ్యూనరేషన్ గణాంకాలకు సంబంధించి అధికారికంగా ఎలాంటి స్పష్టత లేకపోవడంతో ఇందులో నిజమెంత అన్నది తెలియాల్సి ఉంది. అయినప్పటికీ స్టార్ హోస్టుల పారితోషికానికి సంబంధించిన ఈ లెక్కలు ప్రస్తుతం నెట్టింట మాత్రం తెగ వైరల్ అవుతున్నాయి.

# సుమంత్ కెరీర్‌లో ఆ రెండు మిస్సింగ్ హిట్స్!



అక్కినేని హీరో సుమంత్ ప్రస్తుతం వరుస సినిమాలతో మళ్లీ ఫుల్ బిజీగా మారారు. ఆయన హీరోగా తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ 'మహేంద్రగిరి వారాహి'. సంతోష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షి గోస్వామి హీరోయిన్‌గా నటిస్తుండగా.. మాళవిక నాయర్, బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, అలీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిల్మ్స్ బ్యానర్లపై కలిపు మధు, లక్ష్మణ్ నిర్మిస్తున్న ఈ సినిమా సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో పాల్గొంటున్న సుమంత్.. తన కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను బయటపెట్టారు. తన సినీ ప్రయాణంలో రెండు భారీ హిట్స్‌ను మిస్ చేసుకున్నానని, అవి ఇప్పటికీ తనను బాధపెడుతుంటాయని ఓపెన్‌గా చెప్పారు. తరుణ్ హీరోగా తెరకెక్కిన ఆల్‌టైమ్ బ్లాక్‌బస్టర్ 'నువ్వే కావాలి' కథ తొలుత తన వద్దకే వచ్చిందని సుమంత్ వెల్లడించారు. కథ తనకు బాగా నచ్చినా.. అప్పట్లో డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఆ సినిమాను చేయలేకపోయానని, అంతటి హిట్‌ను వదులుకోవడం ఇప్పటికీ బాధగా అనిపిస్తుందని తెలిపారు. ఇక పూరి జగన్నాథ్ దర్శకత్వంలో అల్లు అర్జున్ నటించిన 'దేశముదురు' అవకాశం కూడా మొదట తనకే వచ్చిందని చెప్పారు. అయితే ఆ పాత్రను తాను చేసి ఉంటే అల్లు అర్జున్‌కు వచ్చిన స్థాయిలో మాస్ మేనియా వచ్చేదో లేదో చెప్పలేనని సుమంత్ నిజాయితీగా పేర్కొన్నారు. ఈ రెండు సినిమాలు తన కెరీర్‌లో పెద్ద హిట్స్‌గా నిలిచేవని, వాటిని మిస్ చేసుకోవడం ఒక రకంగా లోటేనని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే గతాన్ని తలచుకుంటూ ఆగిపోకుండా ప్రస్తుతం తనకు నచ్చిన కథలు, పాత్రలపై దృష్టి పెడుతున్న సుమంత్.. నటుడిగా తనకు ఎలాంటి హద్దులు లేవని స్పష్టం చేశారు. కథ డిమాండ్ చేస్తే హీరోగానే కాదు, పూర్తిస్థాయి విలన్‌గా కనిపించేందుకు కూడా సిద్ధమేనని చెప్పడం విశేషం. దీంతో సుమంత్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చకు దారితీశాయి.

# హార్దిక్‌తో డేటింగ్.. అమీషా పటేల్ ఫైర్!



బాలీవుడ్ సీనియర్ నటి అమీషా పటేల్ వ్యక్తిగత జీవితం మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. 51 ఏళ్ల వయసులోనూ పెళ్లికి దూరంగా ఉంటూ తనకు నచ్చిన విధంగా జీవితాన్ని కొనసాగిస్తున్న అమీషా.. గతంలోనే తన వివాహంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఒక మగాడి కోసం తన కుటుంబాన్ని, స్నేహితులను దూరం చేసుకోవాల్సిన అవసరం తనకు లేదని, అందుకే పెళ్లి చేసుకోవాలనే ఆలోచనకు దూరంగా ఉన్నానని ఆమె స్పష్టం చేశారు. అయితే అమీషా ప్రేమ, పెళ్లి విషయాలకు సంబంధించిన వార్తలు మాత్రం ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉన్నాయి. తాజాగా భారత క్రికెట్ స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాతో అమీషా డేటింగ్‌లో ఉందంటూ ఓ ప్రచారం నెట్టింట ఊపందుకుంది. ముంబయిలో జరిగిన ఓ వేడుకలో హార్దిక్, అమీషా కలిసి కనిపించడంతో ఈ రూమర్స్‌కు మరింత బలం చేకూరింది. ఈ సందర్భంగా ఇద్దరూ క్లోజ్‌గా మాట్లాడుకోవడం, అమీషా సరదాగా హార్దిక్ భుజంపై చేయి వేయడం కెమెరాల కంటపడింది. అంతే.. ఆ వీడియో సోషల్ మీడియాలోకి రావడంతో నెటిజన్లు తమకు తోచిన విధంగా కామెంట్లు మొదలుపెట్టారు. ఓ నెటిజన్ అయితే ఏకంగా వీరిద్దరి మధ్య ప్రేమాయణం నడుస్తోందంటూ వీడియోను షేర్ చేశాడు. ఈ పోస్ట్ అమీషా పటేల్ కంటపడటంతో ఆమె సీరియస్‌గా స్పందించారు. సదరు నెటిజన్‌కు గట్టిగానే కౌంటర్ ఇస్తూ.. 'నీకు గర్ల్‌ఫ్రెండ్ లేదనే విషయం స్పష్టంగా తెలుస్తోంది' అంటూ ఫైర్ అయ్యారు. ఒక అమ్మాయి స్నేహపూర్వకంగా పలకరించినా, సరదాగా భుజంపై చేయి వేసినా అందులో ప్రేమను, డేటింగ్‌ను వెతకడం సరికాదని హితవు పలికారు. సాధారణమైన స్నేహపూర్వక చర్యలకు కూడా ఇలాంటి అర్థాలు ఆపాదించడం వెనుక వ్యక్తిగత అనుభవం లేకపోవడమే కారణమంటూ ఘాటుగా స్పందించారు. అంతేకాదు.. ఇతరుల వ్యక్తిగత జీవితాలపై ఇలాంటి ఊహాగానాలు చేయడం కంటే ముందుగా తనకు ఓ గర్ల్‌ఫ్రెండ్‌ను వెతుక్కోవాలని అమీషా ఇచ్చిన సలహా నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది. దీంతో అమీషా పటేల్ రిప్లై ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఒక సాధారణ ఫ్రెండ్లీ మూమెంట్‌ను పట్టుకుని డేటింగ్ రూమర్ క్రియేట్ చేసిన నెటిజన్‌కు అమీషా ఇచ్చిన స్ట్రాంగ్ కౌంటర్‌పై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. మొత్తానికి హార్దిక్ పాండ్యాతో డేటింగ్ అంటూ మొదలైన ప్రచారం కంటే.. దానికి అమీషా పటేల్ ఇచ్చిన ఘాటు రిప్లై ఇప్పుడు మరింత హాట్ టాపిక్‌గా మారింది.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.